ప్రజాశక్తి

మంగళవారం 26 డిసెంబర్ 2023 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

ఆటకు అవాంతరాలు

జిల్లాలో అభివృద్ధికి నోచని క్రీడా మైదానాలు - క్రీడాకారులకు కొరవడిన ప్రోత్సాహం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మంగళవారం జిల్లా పర్యటనకు వస్తున్నారు. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించేందుకు రూపొందించిన కార్యక్రమాన్ని సిఎం జగన్ నల్లపాడు లయోలా పబ్లిక్ స్కూలు క్రీడా మైదానం నుంచి ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా జిల్లాలో పలు ప్రభుత్వం క్రీడా మైదానాలు అభివృద్ధికి నోచుకోకపోవడం చర్చనీయాంశంగా మారింది.

నాలుగున్నర జిల్లాలో క్రీడా మైదానాల అభివృద్ధిపై అధికారులు పట్టించుకోలేదు. ఉమ్మడి జిల్లాలో పేరెన్నికగన్న గుంటూరు బ్రహ్మానందరెడ్డి స్టేడియం అభివృద్ధి పదేళ్లుగా నిలిచిపోయింది. టిడిపి హయాంలో పిపిపి విధానంలో అభివృద్ధి చేయడానికి ప్రణాళిక రూపొందించినా కార్యరూపం దాల్చలేదు. గత నాలుగున్నరేళ్లలో వైసిపి ప్రభుత్వం కూడా ఈ స్టేడియం అభివృద్ధిపై దృష్టి సారించలేదు. చాలా ప్రాంతాల్లో క్రీడా స్థలాలను అభివృద్ధి చేయకపోవడం వల్ల ఔత్సాహిక క్రీడాకారుల సంఖ్య పెరగడం లేదు.

జిల్లా పరిషత్, మునిసిపల్, ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడా మైదానాల అభివృద్ధి చేయడంలేదు. నాడు-నేడులో కొన్ని పాఠశాలలను అభివృద్ధి చేసినా క్రీడా మైదానాల అభివృద్ధిపై ▶ 2లో

నేడు సిఎం జగన్ రాక

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

'ఆడుదాం ఆంధ్ర' క్రీడా పోటీలను ప్రారంభించేందుకు సిఎం జగన్ మంగళవారం నల్లపాడులోని లయోలా పబ్లిక్ స్కూలుకు రానున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించేందుకు రూపొందించిన ఈ కార్యక్రమాన్ని నల్లపాడు నుంచి ఆయన శ్రీకారం చుట్టనున్నారు. సిఎం పర్యటన ఏర్పాట్లను స్థానిక నల్లపాడులోని లయోలా పబ్లిక్ స్కూల్లో సోమవారం రాష్ట్ర యువజన సర్వీసులు, పర్యాటక సాంస్కృతిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సి.ప్రధ్యుమ్న, ఎమ్మెల్సీలు తలశిల రఘురామ్, లేళ్ల అప్పిరెడ్డి, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, జెసి జి.రాజకుమారి, తెనాలి సబ్-కలెక్టర్ ప్రకార్ జైన్, నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరి పరిశీలించారు. క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, బ్యాడ్మింటన్, క్రీడాంశాలకు సంబంధించి ఆట స్థలాలను పూర్తిగా సిద్ధం చేయాలన్నారు. ఆటలు పోటీల నిర్వహణ ఏర్పాట్లపై అధికారులతో కలెక్టర్ చర్చించారు.

నేటి నుండి మున్సిపల్ సమ్మె

జిల్లాలో రెండు కార్పొరేషన్లు, రెండు మున్సిపాల్టీల్లో సిద్ధమైన కార్మికులు

ప్రజాశక్తి-గుంటూరు

మున్సిపల్ కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని ఎపి మున్సిపల్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో నేటి నుండి సమ్మెలోకి వెళ్లనున్నారు. సమస్యలపై ఈనెల 14న ఉన్నతాధికారులతో జరిగిన చర్చల్లో డిమాండ్లపై ప్రభుత్వ నుండి సానుకూలత లేకపోవటంతో రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేపడుతున్నట్లు నాయకులు స్పష్టం చేసిన విషయం విదితమే. దీనిలో భాగంగా గుంటూరు జిల్లాలోనూ మంగళగిరి-తాడేపల్లి, గుంటూరు కార్పొరేషన్లు, పొన్నూరు, తెనాలి మున్సిపాల్టీల్లో సమ్మె జరుగుతుందని యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు తెలిపారు.

జిల్లాలోని రెండు మున్సిపాల్టీలు, రెండు కార్పొరేషన్లలో పనిచేస్తున్న పారిశుధ్యం, ఇంజినీరింగ్, వాటర్ వర్క్స్, స్ట్రీట్‌లైట్స్ విభాగాలలో పనిచేస్తున్న కార్మికులు, చెత్త ట్రాక్టర్లు ట్రాక్టర్స్ డ్రైవర్లు తదితర రంగాల కార్మికులు సుమారు 6వేల మంది పనిచేస్తున్నారు. వీరంతా దాదాపుగా సమ్మెలో ఉంటారని నాయకులు తెలిపారు. ప్రధానంగా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, పర్మినెంట్ చేయాలనే ప్రధాన డిమాడ్లతో పాటు ఇంజినీరింగ్ కార్మికులకు జిఒ 30ని సవరించి వేతనాలు ఇవ్వాలని కోరుతున్నారు. గతంలో ఇచ్చిన జిఒ 30లో తప్పులు దొర్లటం వల్ల కొందరు స్కిల్డ్ వర్కర్లు కూడా అన్‌స్కిల్డ్ వేతనాలు తీసుకోవాల్సి ఉంది.ప్రస్తుతం పారిశుధ్య కార్మికులకు రూ.15వేల వేతనం, రూ.6వేలు హెల్త్ అలవెన్స్ ఇస్తున్నారు. హెల్త్ అలవెన్స్ ప్రతి ▶ 2లో

కుల వ్యవస్థను ప్రోత్సహించే మనుస్మృతి దహనం పేజీ 8

ఖాళీ విస్తర్లతో సమగ్ర శిక్షా ఉద్యోగుల నిరసన పేజీ 8

వ్యాపారుల సిండికేట్.. ధాన్యం ధరలు పతనం పేజీ 3

ఇంకెన్నాళ్ళు , కమనీయం నాటికల్లో సన్నివేశాలు

అలరిస్తున్న నంది నాటకోత్సవాలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

నంది నాటకోత్సవాలు గుంటూరు నగరానికి ఒక అద్భుత రసానుభూతిని పంచుతున్నాయి. ప్రతిభావంతమైన నటనాశక్తి వున్న నటీనటులతో ప్రేక్షకజన రంజక అంశాలతో రూపొందిన నాటకాలు, నాటికలు పోటీ ప్రదర్శలలో రంగస్థలం మీద రంగు లీనుతున్నాయి. ఈ ప్రదర్శనలలో మూడో రోజు సోమవారం రెట్టించిన ఉత్సాహంతో చూపరులందరినీ ఆకట్టుకున్న ప్రదర్శలు దేనికదే తమ ప్రత్యేకతలను చాటుకున్నాయి. దాంతో 'హాలు నిండినది' తరహా పరిస్థితి నిర్వాహకులకు తప్పలేదు. శ్రీరామ పాదుకలు, మంచి (గుణ) పాఠం, ఝనక్ ఝనక్ పాయల్ బాజే నాటకం, బండల పక్కన ఏరు .ఏరు పక్కన ఊరు. ఊరుకొక్క పోరు అంటూ పోరాటాలు, ఆరాటాలు వీటన్నిటి నేపథ్యలో ప్రపంచానికి పోరాటం నేర్పిన కళాకారుడు పరిస్థితి తనదాకా వస్తే ఎలావుంటుందన్న విషయాన్ని ఝనక్ ఝనక్ పాయల్ బాజే నాటిక చూపించింది. ఎంఎస్ చౌదరి రచన దర్శకత్వాలలో తెనాలి వారు ఈ నాటకాన్ని ప్రదర్శించారు. ని'శ్శబ్ధమా....నీ ఖరీదెంత?' (నాటిక) పి.టి.మాధవ్ నాటకీకరణలో చలసాని కష్ణ ప్రసాద్ దర్శకత్వంలో ఇది ప్రదర్శితమైంది.'ఇంకెన్నాళ్ళు....? నాటకం బాగా ఆకట్టుకుంది. ఇది 'దిశ' యధార్థ కథ ఆధారంగా ఆధారంగా అనంతపురం ఎస్ ఎస్బి ఎన్ డిగ్రీ కాలేజి విద్యార్థులు ఆముదాల సుబ్రహ్మణ్యం రచన దర్శకత్వాలలో ఈ నాటికను ప్రదర్శించారు. సమర్ధవంతమైన సంఘటితమైన సమసమాజ ఆవిష్కరణవైపు అడుగులు వేయించే 'కమనీయం' నాటిక అలరించింది. జరుగుతున్న కథ నాటికలో ▶ 2లో

పండగ రోజూ సమ్మె హోరు..

ప్రజాశక్తి-పల్నాడు, గుంటూరు జిల్లా

అంగన్‌వాడీలకు ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం తెలంగాణ కంటే వెయ్యి రూపాయలు వేతనం పెంచాలని, సుప్రీం కోర్టు ప్రకారం గ్రాట్యుటీ అమలు చేయాలని తదితర డిమాండ్లతో అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధి సమ్మె 14వ రోజుకు చేరుకుంది. సోమవారం పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని సమ్మె శిబిరాన్ని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ముజఫర్ అహ్మద్, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు సందర్శించి సంఘీభావం తెలిపారు. శిబిరంలోనే క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ముజఫర్ అహ్మద్ మాట్లాడుతూ వెట్టి చాకిరి చేస్తూ చిన్నారులకు, బాలింతలకు, గర్భిణులకు విశేష సేవలు అందిస్తున్న అంగన్వాడీల సమస్యలు పరిష్కారానికి ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్య చేస్తోందని ప్రశ్నించారు. అంగన్వాడీల జీతాలు

నరసరావుపేట సమ్మె శిబిరంలో కేక్‌ను కట్ చేసి అంగన్వాడీలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుతున్న సిఐటియు, టిడిపి నాయకులు

గుంటూరు సమ్మె శిబిరంలో నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు

ఆట స్థలాలను అభివృద్ధి చేయండి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

అభివృద్ధి చేయకుండా 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమాలను ఎలా చేపడతారని జిల్లా అధ్యక్షులు తెలుగు యువత రావిపాటి సాయికృష్ణ ఆరోపించారు. 'ఆడుదాం ఆంధ్ర సరే..ఆడటానికి ఆట స్థలం ఏది...' అంటూ గుంటూరులో బి ఆర్ స్టేడియాన్ని శిథిలావస్థకు చేర్చి అభివృద్ధి పరచకపోవడం పై పలు విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జనసేన జిల్లా అధికార ప్రతినిధి ఆళ్ల హరి, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ వళి,ఎన్ఎస్ యుఐ జిల్లా అద్యక్షులు సయ్యద్ కరీం,యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నూనె పవన్ తేజ తదితరులు మాట్లాడారు. 'అడుగుదాం ఆంధ్ర' పేరుతో ముఖ్యమంత్రి గుంటూరు పర్యటనను వ్యతిరేకిస్తూ తెలుగు యువత, జనసేన, ఎఐవైఎఫ్ ,యువజన కాంగ్రెస్, ఎన్ఎస్యు, యువజన సంఘాలతో కూడిన బృందం గుంటూరులో శిథిలావస్థకు చేరిన కాసు బ్రహ్మానంద రెడ్డి స్టేడియం ను పరిశీలించారు. ఆడియన్స్ లాంజ్ లలో పెరిగిన జమ్మి,పిచ్చి మొక్కలను తొలగించారు. లోపల ఉన్న పశువులను బయటకు తోలి నిరసన తెలిపారు. గత నాలుగున్నరేళ్లుగా క్రీడారంగాన్ని అభివృద్ధి చేయకుండా ఇప్పుడు ఎన్నికల కోసం 'ఆడుదాం ఆంధ్రా' చేపట్టారని విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి పేరుతో ఉన్న పెద్ద క్రీడామైదానాన్ని పాడుపెట్టి ప్రైవేట్ సంస్థల స్థలంలో ఆటలపోటీల ప్రారంభానికి ముఖ్యమంత్రి రావటం సిగ్గు చేటని అన్నారు. తెలుగుయువత జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నాగుల్ మీరా బాబు ,జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి మన్నెం శ్రీనివాస్ రావు,జిల్లా కార్యదర్సులు ఇ.త్రినాథ్,పఠాన్ అథావుల్లా ఖాన్, తెలుగుయువత నాయకులు పి.రాంబాబు, ఎస్.అనిల్, సింగు నాగమల్లేశ్వరావు, సంపత్, టిడిపి నాయకులు షేక్ ఉమైన్ అక్బర్ ,కొల్లి నాగుల్,ఉపెంద్ర, యువజన కాంగ్రెస్ నాయకులు ఛార్లెస్ ప్రదీప్, షేక్ మహమూద్, రాజు పాల్గొన్నారు.

అక్కడ చెల్లని రూపాయి ఇక్కడ చెల్లుతుందా?

విడుదల రజనిపై బోనబోయిన సైటర్లు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

చిలకలూరిపేటలో గెలవలేని మంత్రి విడుదల రజని గుంటూరు పశ్చిమలో గెలుస్తుందా అని జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్యాదవ్ విమర్శించారు. స్థానిక అమరావతి రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన జనసేన కార్యాలయాన్ని సోమవారం పార్టీ జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ అభ్యర్థులను మార్చినంత మాత్రాన ప్రభుత్వం వల్ల నష్టపోయిన వారు, వైసిపి నాయకుల వల్ల ఇబ్బందులు పడిన వారిలో అసంతృప్తి, ఆగ్రహం తగ్గుతాయా అని ప్రశ్నించారు. అభివృద్ధి లేకుండా, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు తగ్గిపోయి ప్రజలంగా అల్లాడుతుంటే కేవలం కొత్త అభ్యర్థులను ఎన్నికలల్లో పోటీ చేయిస్తే గెలుస్తారా అని ప్రశ్నించారు. అక్కడ చెల్లని రూపాయి ఇక్కడ చెల్లుతుందా అని ఎద్దేవా చేశారు. మొత్తంగా ప్రభుత్వంపైనా, వైసిపి పార్టీపైనా ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు. ఎవరు పోటీ చేసినా గుంటూరు పశ్చిమలో టిడిపి, జనసేన అభ్యర్థి 50 వేల ఓట్ల ఆధికత్యతో గెలుస్తారని జోస్యం చెప్పారు. సిఎం జగన్ గత నాలుగున్నరేళ్లుగా ప్రజా సమస్యలను పట్టించుకోకుండా, ప్రజల్లోకి రాకుండా తాను ఎంచుకున్న పథకాలతోనే కాలక్షేపం చేశారని అన్నారు. కార్యక్రమలో పార్టీ జిల్లా అధ్యక్షులు జి.వెంకటేశ్వరరావు, అధికార ప్రతినిధి ఎ.హరి, తూర్పు నియోజకవర్గం నాయకులు ఎన్.సురేష్, పార్టీ నాయకులు మార్కెండేయులు, వి.రత్తయ్య పాల్గొన్నారు.

నేటి నుండి మున్సిపల్ సమ్మె

(మొదటి పేజీ తరువాయి)

నెలా సకాలంలో విడుదల చేయట్లేదు. రెండు, మూడు నెలలకోసారి మాత్రమే ఇస్తున్నారు. పర్మినెంట్ కార్మికులకు ఇస్తున్న విధంగా బేసిక్తోపాటు, డిఎ కలిపి ఇవ్వాలని కోరుతున్నారు. అండర్గ్రౌండ్ డ్రైనేజి వర్కర్లు, చెత్త తరలించే వాహనాల డ్రైవర్లు, మలేరియా వర్కర్లు, పార్కు వర్కర్లకు కూడా పారిశుధ్య కార్మికుల మాదిరిగా హెల్త్ అలవెన్స్, ఇంజినీరింగ్ కార్మికులకు రిస్క్ అలవెన్స్ ఇవ్వాలనే డిమాండ్ ఉంది. క్లాప్ ఆటో డ్రైవర్లకు రూ.18 వేలు జీతం ఇవ్వాలని, విలీన గ్రామ పంచాయతీల్లోని కార్మికులకు కూడా మున్సిపల్ వర్కర్లకు ఇస్తున్న జీతాలు ఇవ్వాలని అడుగుతున్నారు. మంగళగిరి-తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్లో విలీనం అయిన గ్రామాల్లోని పారిశుధ్య కార్మికులకు మున్సిపల్ వర్కర్లకు ఇస్తున్న జీతాలుగానీ, హెల్త్ అలవెన్స్గానీ ఇవ్వట్లేదు. ఇటీవల జరిగిన ప్రిన్సిపల్ సెక్రెటరీతో జరిగిన చర్చల్లో అండర్గ్రౌండ్, మలేరియా, పార్క్ వర్కర్లకు, చెత్త డ్రైవర్లకు రూ.6 వేలు హెల్త్ అలవెన్స్ ఇస్తామని ప్రిన్సిపాల్ సెక్రెటరీ హామీ ఇచ్చారు. అయితే జిఒ ఇంకా విడుదల కాలేదు. శాశ్వత స్వభావం కలిగిన పనిలో పనిచేస్తున్నందున మున్సిపల్ వర్కర్లను పర్మినెంట్ చేయాలని, ఈ లోగా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఇతర డిమాండ్లపై ప్రభుత్వ నుండి సానుకూలత లేదు. దీంతో సమ్మెలోకి వెళుతున్నట్లు నాయకులు ప్రకటించారు.ప్రభుత్వం నాయకులతో చర్చలు జరిపి సమ్మెను నివారించాలని ముత్యాలరావు కోరారు.

సమ్మెలో భాగంగా సోమవారం రాత్రి సమ్మెకు సంబంధించిన కరపత్రాలను మంగళగిరిలోని సిఐటియు కార్యాలయంలో ఆవిష్కరించారు. సమ్మెలో మంగళగిరి తాడేపల్లి నగరపాల సంస్థ పరిధిలో పనిచేసే కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు ఎస్ఎస్ చెంగయ్య పిలుపునిచ్చారు. సీనియర్ నాయకులు జెవి రాఘవులు, టి.శ్రీరాములు, మున్సిపల్ యూనియన్ నాయకులు మంగయ్య, పి.పూర్ణ, కె.నాగేశ్వరమ్మ పాల్గొన్నారు. తాడేపల్లిలోని పలు మస్టర్ పాయింట్ల వద్ద యూనియన్ నాయకులు వి.దుర్గారావు, కె.కరుణాకరరావు సమావేశాలు నిర్వహించారు.

మంగళగిరిలో కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న కార్మికులు, నాయకులు. తాడేపల్లిలో సమావేశం

అలరిస్తున్న నంది నాటకోత్సవాలు

(మొదటి పేజీ తరువాయి)

తల్లిదండ్రులు తమ సంతానానికి ఆర్థిక పరిపుష్టి కలిగించడానికి తమ శక్తియుక్తులన్నీ దారపోసి అందుకు తమ అవసరాలను కూడా వారు మరచిపోతారు. తమకు ఏమీ మిగుల్చుకోరు. మరి ఇలా అన్నీ... బిడ్డల కోసమే ఇచ్చేస్తే, వృద్ధాప్యంలో ఎవరు వారిని ఆదరిస్తారు. అపహాస్యం పాలైన మానవ సంబంధాలను వర్ణించారు. బిడ్డల చేతుల్లో అమ్మానాన్నలు ఇలా అవమానాల పాలు కావలసిందేనా! వద్ధాప్యంలో మీకు కావలసింది ఏమిటీ? జీవితచరమాంకంలో మన అవసరాలు తీర్చేదెవరు? సమకాలీన సమస్యను అరవింద్ ఆర్ట్స్ తాడేపల్లి వారు నాటకీకరించారు. రచన వల్లూరు శివప్రసాద్, దర్శకత్వం గంగోత్రి సాయి వహించారు. నాటికలు ప్రదర్శించిన వారికి ఎఫ్డిసి చైర్మన్ పోసాని కృష్ణమురళీ తదితరులు నగదు పారితోషకాలు జ్ఞాపికలు అందించారు.

పారితోషకం, అందుకుంటున్న 'కమనీయం' కళాకారుల బృందం

ఆటకు అవాంతరాలు

(మొదటి పేజీ తరువాయి)

దృష్టి సారించలేదు. చాలా ఆటస్థలాల్లో పిచ్చిమొక్కలు, వర్షంనీరు నిల్వ ఉండి బురదగా మారడం, ఎప్పటికప్పుడు వివిధ క్రీడల నిర్వహణకు అనువైన పరిస్థితులు కల్పించలేకపోతున్నారు. పలు గ్రామాల్లో జిల్లా పరిషత్ పాఠశాలలకు చాలా చోట్ల పెద్ద ఖాళీ స్థలాలు ఉన్నాయి. వీటి అభివృద్ధికి నిధులు కేటాయించకపోవడం వల్ల విద్యార్థులు ఆడుకునేందుకు అవకాశాలు క్రమంగా తగ్గుతున్నాయి. మునిసిపల్, ప్రభుత్వపాఠశాలల్లో కూడా క్రీడా పరికరాలు కొనుగోలు చేయడంలేదు. చాలా పాఠశాలల్లో క్రీడా పరికరాల కొనుగోలుకు నిధుల కేటాయింపు లేదు. ఇందువల్ల చాలాకాలంగా విద్యార్థులు క్రీడా రంగంపై దృష్టి పెట్టలేకపోతున్నారు. పిఈటిపోస్టుల కొరత కూడా ఎక్కువగానే ఉంది.

నెరవేరని సిఎం హామీలు

సిఎం జగన్ ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన సంక్షేమ కార్యక్రమాల ప్రారంభోత్సవాల్లో పాల్గొన్నారు. ఆయా నియోజకవర్గాల్లో ప్రజలకు పలు హామీలు ఇస్తున్నారు. కానీ హామీల అమలుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదు. 2022 జనవరి ఒకటో తేదీన పత్తిపాడులో సిఎం జగన్ హామీ ఇచ్చి దాదాపు రెండేళ్లవుతున్నా ఇప్పటికీ నెరవేరలేదు. ప్రత్తిపాడులో డబల్లైన్ రోడ్డు, సెంట్రల్ డివైడర్, లైటింగ్ ఏర్పాటు ఇంత వరకు కార్యరూపం దాల్చలేదు. గతేడాది నవంబరు 11న పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం వంకాయలపాడులో పర్యటించారు. వంకాయలపాడులో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ స్థాపనకు వచ్చినప్పుడు జిల్లాకో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ప్రారంభిస్తామన్నారు. ఇంతవరకు జిల్లాలో ఈ యూనిట్ నిర్మాణం జరగలేదు. అదే రోజు గుంటూరు శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో భారతరత్న మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ 135 వ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. గుంటూరులో పెండింగ్లో ఉన్న భూగర్భ డ్రెయినేజి పథకానికి రూ.287 కోట్లు, శంకర్ విలాస్ వద్ద బ్రిడ్జిని విస్తరింపచేసేందుకు రూ.131 కోట్లు కేటాయిస్తున్నట్టు తెలిపారు. ఏడాది దాటినా ఇంతవరకు కదలిక లేదు. తెనాలిలో జరిగిన సభలోనూ నియోజకవర్గానికి ఇచ్చిన హామీలు ఇంత వరకు నెరవేరలేదు. పిడుగురాళ్ల మండలం కామేపల్లిలో రూ. 500కోట్లతో 47.53 ఎకరాలలో ప్రభుత్వ మెడికల్ కాలేజీ నిర్మాణం నత్తనడక సాగుతోంది. పల్నాడులో వైద్య సదుపాయాలు మెరుగుపడలేదు. పేరేచర్ల-కొండమోడు నాలుగు లైన్ల జాతీయ రహదారి నిర్మాణం ఇంకా ప్రారంభం కాలేదు. గోదావరి, పెన్నా అనుసంధానం పనుల్లో కదలిక లేదు. పల్నాడు వాటర్ గ్రిడ్కు పరిపాలన ఆమోదం తెలుపుతూ నిధులు కేటాయించినా ఇంత వరకు టెండర్లుకూడా పిలవలేదు. పల్నాడు ప్రాంతంలోని ఏడు నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో తాగు, సాగునీటి కష్టాలు నిత్యకృత్యమయ్యాయి. గ్రామాల్లో రహదారులు బాగా అద్వానంగా ఉన్నాయి.

పండగ రోజూ సమ్మె హోరు..

(మొదటి పేజీ తరువాయి)

పెంచబోయేది లేదని రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీ చరణ్ చేసిన ప్రకటనను సిఐటియు తీవ్రంగా ఖండిస్తుందన్నారు. అంగన్వాడీల సమస్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరి వీడి వేతనాలు పెంచాలని, లేకుంటే కార్మిక సంఘాలన్నీ కలిసి ఉద్యమించి ప్రభుత్వం మెడలు వంచుతామని హెచ్చరించారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం వేతనాలు, గ్రాట్యుటీ పెంచే వరకు పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. వైసిపి అధికారంలోకి వచ్చాక రూ.వెయ్యి వేతనం పెంచి చేతులు దులుపుకుందని మరోవైపు నిత్యావసర ధరలు రెట్టింపు అయ్యాయని సెంటర్ల అద్దెలు కూడా పెరిగాయన్నారు. అంగన్వాడీలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులని వారికి జీతాలు పెంచేది లేదని రాష్ట్ర ప్రభుత్వం సమర్ధించుకోవడం సరికాదన్నారు. సచివాలయ సిబ్బంది అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహరిస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. బిజెపి ప్రభుత్వం గత నాలుగేళ్లుగా బడ్జెట్లో అంగన్వాడీల నిధులు పెంచలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. డాక్టర్ చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ తమ సమస్యల పరిష్కారం కోసం అంగన్వాడీల పోరాటం చూస్తుంటే ఆనందంగా ఉందన్నారు. అంగన్వాడీలపై రాష్ట్ర ప్రభుత్వం బెదిరింపు చర్యలకు పాల్పడినా ఆందోళన కార్యక్రమాలతో ముందుకు సాగడం పట్ల అభినందనలు తెలిపారు. సమ్మె చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. ఎన్నికల్లో అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను విస్మరించి ప్రస్తుతం అంగన్వాడీలను బెదిరించి భయభ్రాంతులతో సమ్మె విచ్ఛిన్నం చేయడానికి కుట్ర చేస్తుందని మండిపడ్డారు. జగన్మోహన్ రెడ్డి కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని ఏపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.మల్లేశ్వరి, కౌలు రైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు కె.రామారావు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు షేక్ సిలార్ మసూద్, నాయకులు నిర్మల, మాధవి, కవిత, ఎఐటియుసి రాష్ట్ర సహాయ కార్యదర్శి హెల్డా ఫ్లారిన్స్, నాయకులు శోభారాణి, విజయ కుమారి, విజయలక్ష్మి, ఎఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి కె.రాంబాబు, అధ్యక్ష కార్యదర్శులు యు.రంగయ్య, వి.వెంకట్, నాయకులు కె.బ్రహ్మయ్య, కె.వెంకటేశ్వర్లు, మెట్టు వెంకటేశ్వరరెడ్డి, టిడిపి రొంపిచర్ల మండల అధ్యక్ష కార్యదర్శులు పి.జగ్గయ్య, పి.నాగిరెడ్డి, మన్నన్ షరీఫ్, అంగన్వాడీలు పాల్గొన్నారు. గుంటూరు కలెక్టరేట్ ఎదుట కొనసాగుతున్న సమ్మె శిబిరంలో పండుగ రోజైనా అంగన్వాడీలు పాల్గొని నిరసన తెలిపారు. క్రిస్మస్ను పురస్కరించుకొని కేక్ కట్ చేసి, శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) నగర ప్రధాన కార్యదర్శి టి.రాధ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి. దీప్తి మనోజ, ఉపాధ్యక్షురాలు ఎస్.కె.బాజి, సహాయ కార్యదర్శి డి.వేదవతి, నాయకులు సులోచన తదితరులు పాల్గొన్నారు.

వైసిపి యూత్ మండల అధ్యక్షునిగా సతీష్‌రెడ్డి

ప్రజాశక్తి - రెంటచింతల

రెంటచింతల మండల వైసిపి యూత్ అధ్యక్షునిగా కొమ్మారెడ్డి సతీష్ రెడ్డి నియమిస్తూ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ పలనాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకష్ణారెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. మొదటిసారిగా తనకు పదవిని కేటాయించిన పిన్నెల్లి సోదరులకు సతీష్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో తీసుకువెళ్లేలా కృషి చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా సతీష్‌రెడ్డికి మండల నాయకులు ఉమా మహేశ్వర్‌రెడ్డి, ఏరువ ప్రతాపరెడ్డి,టి.ఇన్నారెడ్డి అభినందనలు తెలిపారు

నల్లపాటి చంద్రశేఖరరావుకు పుట్టినరోజు శుభాకాంక్షలు చెబుతున్న అరవిందబాబు

నల్లపాటి పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

జిడిసిసి బ్యాంక్ మాజీ ఛైర్మన్ నల్లపాటి శివరామచంద్ర శేఖర్ ను నేటి రాజకీయ నాయకులు స్ఫూర్తిగా తీసుకోవాలని టిడిపి నరసరావుపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. సోమవారం నల్లపాటి శివరామ చంద్రశేఖరరావు పుట్టినరోజు సందర్భంగా జొన్నలగడ్డ పరిధిలోని జీవనజ్యోతి కోల్డ్ స్టోరేజ్ వద్ద గల నివాసంలో ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. తన తండ్రికి శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చిన అరవిందబాబుకు టిడిపి రాష్ట్ర కార్యదర్శి నల్లపాటి రామచంద్ర ప్రసాద్ ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అరవిందబాబు మాట్లాడుతూ జిడిసిసి బ్యాంక్ ఛైర్మన్ గా ఆయన చేసిన సేవలను గుర్తుచేశారు. ఎటువంటి స్వార్థాలకు తావు లేకుండా ప్రజల కోసం, అభివృద్ధి కోసం పరితపించే నల్లపాటి లాంటి వ్యక్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. సామాన్య కుటుంబం నుండి వచ్చినప్పటికి ఉన్నత చదువులు అభ్యసించడం జిడిసిసి బ్యాంక్ చైర్మన్ గా ఎదిగిన తీరు యువ నాయకులకు ఆదర్శవంతం అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మన్నన్ షరీఫ్, ఎం. వెంకటేశ్వరరెడ్డి, జి. సురేష్, కె.గంగాధర్,పి.దాసు,సిహెచ్ మస్తాన్ వాలి,నన్ను అక్బర్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న అన్న క్యాంటీన్ సేవలు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

పేదలకు పట్టెడన్నం పెట్టడమే లక్ష్యం గా చిలకలూరిపేటలో ప్రత్తిపాటి ఫౌం డేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్ సేవలు నిర్విరామం గా కొనసాగుతు న్నాయని నిర్వాహకులు జువ్వాజి బుచ్చిబాబు ఒక ప్రకట నలో అన్నారు.సోమవారం కల్యాణి సెంటర్ లో అన్న క్యాం టీన్ ద్వారా షుమారుగా 625 మందికి భోజన సదుపాయం కల్పించినట్లు తెలిపారు.

నేడు రాజకీయ పార్టీల సమావేశం

ప్రజాశక్తి-పెదకూరపాడు

పెదకూరపాడు నియోజకవర్గ లోని అన్ని రాజకీయ పార్టీలు సమావేశం మంగళవారం పెదకూరపాడు తహశీల్దార్ కార్యాలయంలో జరుగుతుందని అసిస్టెంట్ ఓటర్ నమోదు అధికారి జియా తెలిపారు. పెదకూరపాడు, అమరావతి, అచ్చంపేట, క్రోసూరు, బెల్లంకొండ మండలాల అసిస్టెంట్ ఓటర్ల నమోదు అధికారులు, సిబ్బంది నియోజకవర్గ ఓట్ల నమోదు అధికారి కూడా పాల్గొంటారన్నారు.

పెదకూరపాడులో 'ఆడుదాం ఆంధ్రా'

ప్రజాశక్తి-పెదకూరపాడు

పెదకూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఆడుదాం ఆంధ్ర కింద క్రికెట్ పోటీలు జరుగుతాయని ఆ పాఠ శాల ఫిజికల్ డైరెక్టర్ నాగరాజు తెలిపారు. ఈ పోటీలను ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ప్రారంభిస్తారని చెప్పారు. సచివాలయ స్థాయిలో ఈ పోటీలు జరుగుతాయని, ఆ తర్వాత మండల స్థాయి, నియోజకవర్గ స్థాయిలలో పోటీలు జరుగుతాయని వివరించారు.

వ్యాపారుల సిండికేట్.. ధాన్యం ధరలు పతనం

ప్రజాశక్తి - దుగ్గిరాల

సిండికేటుగా మారిన ధాన్యం వ్యాపారులు ధరలను అమాంతం తగ్గించేస్తున్నారు. ఖరీఫ్ ప్రారంభంలో బస్తా (75 కిలోలు) ధాన్యం ధర రూ.1650 ఉండతగా తుపాను అనంతరం రూ.2030కు పెరిగింది. తుపాను కారణంగా దిగుబడి తగ్గుతుందని, ధాన్యం ధరలింకా పెరుగుతాయని కొద్దిరోజుల కిందట వ్యాపారులు చెప్పుకొచ్చారు. అయితే రైతు చేతికి ధాన్యం వస్తున్న కొద్దీ ధరలను వేగంగా దిగ్గోస్తున్నారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో రూ.1750కు మాత్రమే కొంటున్నారు. అంటే రూ.300 వరకూ ధర పడిపోయింది. దీని ప్రకారం రైతులు స్వల్ప కాలంలోనే ఎకరాకు 30 బస్తాలు పండించిన రైతు రూ.9 వేలు నష్టపోతున్నట్లు లెక్క. మరోవైపు తుపాను వల్ల ఎకరాకు 10 బస్తాల వరకూ దిగుబడి తగ్గింది. తుపాను ముందు నూర్పిడి చేసిన పొలంలో 42-45 బస్తాల దిగుబడి రాగా తుపాను అనంతరం పొలాల్లో గింజలు తడవడం, రాలిపోవడం తదితర కారణాలతో దిగుబడి

30-35 బస్తాలకే పరిమితమైంది. దీంతో రైతులు రెండు విధాలుగా నష్టపోతున్నారు. ఈ మొత్తం నష్టం ఎకరాకు రూ.20 వేల వరకూ ఉంటోంది. అయినా ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.1680 కంటే బహిరంగ మార్కెట్లో ధర కాస్త ఎక్కువగా ఉండడంతో రైతులు తమ పంటను వ్యాపారులకు కళ్లాల్లోనే అమ్ముకుంటున్నారు.



అగ్ని ప్రమాద బాధితులకు సాయం

ప్రజాశక్తి - వినుకొండ

మండలంలోని పాత నాగిరెడ్డిపల్లికి చెందిన దానబోయిన వెంకట్రావు , దానబోయిన శ్రీరామమూర్తి ల నివాస గృహాలు అగ్ని ప్రమాదంలో పూర్తిగా దగ్ధ మయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న నియోజకవర్గం జనసేన పార్టీ సమన్వయకర్త కొంజేటి నాగ శ్రీను ఘటనా స్థలాన్ని పరిశీలించి, బాధిత కుటుంబానికి భరోసా కల్పిం చారు. బాధిత కుటుంబాలకు తక్షణ ఆర్థిక సాయంగా రూ. 20,000 కొంజేటి నాగ శ్రీను చేతుల మీదుగా అంద జేశారు. అలాగే, ప్రభుత్వం వెంటనే స్పందించి బాధితులకు పక్కా గృహాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి ఎన్. రమణరావు, నియోజకవర్గం అధి కార ప్రతినిది. పి.అభి మన్యు, శావల్యాపురం మండల అధ్యక్షులు ఎ.అనిల్‌కుమార్, నూజెండ్ల మండలం ఉపాధ్యక్షుడు రజబాబు , వినుకొండ మండల ఉపాధ్యక్షులు గండికోట మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిలర్ నివాసలో ఆత్మీయ విందు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

క్రిస్మస్ పండగ సందర్భంగా స్థానిక సంజీవనగర్‌లో 33 వ వార్డు కౌన్సిలర్ కొచ్చర్ల

విజయలక్ష్మి, వైసిపి నాయకులు కొచ్చర్ల కిషోర్ వారి నివాసగృహంలో ఆత్మీయ విందు ఏర్పాటు చేశారు. ఈ విందుకు వైసిపి నియోజకవర్గ సమన్వ యకర్త మల్లెల రాజేష్ నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భం గా రాజేష్ నాయుడుని విజయలక్ష్మి, కిషోర్ కుటుంబ సభ్యులు శాలువతో సత్కరించారు.

ఉద్యోగం పేరిట మోసంపై కేసు

ప్రజాశక్తి-తెనాలి

సాఫ్ట్వేర్ ఉద్యోగం ఇప్పిస్తామంటూ నగదు తీసుకొని మోసం చేసిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానిక చినరావూరు ప్రాంతానికి చెందిన మమత, అయితా నగర్ లో నివాసం ఉంటుంది. పది రోజుల క్రితం సామాజిక మాధ్యమాలలో ఉద్యోగం పేరిట వచ్చిన ప్రకటనలను చూసి ఫోన్లో సంప్రదించగా, ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికి కొంత సొమ్ము డిమాండ్ చేశారు. వారిని నమ్మిన ఆమె ఆన్లైన్ లో నగదును పంపింది. ఉద్యోగం ఇప్పించకపోగా వారి ఫోన్లకు స్పందించకపోవడంతో మోసపోయానని గ్రహించి ఆమె పోలీసులను ఆశ్రయించటంతో కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-తెనాలి

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు తీవ్రంగా గాయపడిన ఘట నపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చెందిన 70 ఏళ్ల వద్దుడు సుభాని తన స్కూటర్‌పై ఆదివారం రాత్రి సినిమాకి వెళ్ళాడు. తిరిగి ఇంటికి వెళ్లే క్రమంలో ఎడ్ల లింగయ్య పెట్రోల్ బంకు సమీ పంలో అతివేగంగా వచ్చిన కారు స్కూటర్‌ను ఢీ కొట్టింది. వృద్ధుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు స్పందించి వృద్ధుని ద్వారా సమాచారం సేకరించి, జరిగిన ఘటనను ఆయన బంధు వులకు తెలిపారు. ఘటనా స్థలానికి చేరుకున్న బంధువులు ప్రైవేట్ వైద్యశాలకు తరలించి చికిత్స చేయిస్తున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఒంగోలు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

SA OP No : 4/2018

భూషణం హనుమంతరావు ...పిటిషనరు

మరియు

అయినాబత్తిన కవిత వగైరాలు .... రెస్పాండెంట్స్

ప్రకటన

To

R14) బూసి సుబ్బరతమ్మ భర్త సుబ్బారావు నివాసం బొడ్డురాయివద్ద గణపవరం గ్రామం చిలకలూరిపేట మండలం, గుంటూరు జిల్లా (పాత)

మీకు పై నెంబరు పిటిషన్ లో కోర్టు వారు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపిననూ ముట్టనందున కోర్టువారు మీనోటీసు నిమిత్తం వాయిదా తేదీ: 11-01-2024న వేసిఉన్నారు కావున ఆరోజు ఉదయం 10 గంటల 30 నిమిషాలకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని లేక లాయర్ గారి ద్వారా గాని హాజరపడి మీ ఆక్షేపణలు తెలియ జేయవలసినది లేనియెడల మీ పరోక్షమున పిటిషన్ తీర్మానము చేయబడునని తెలియజేయడమైనది

వాయిదా తేది : 11-01-2024

// కోర్టు వారి అనుమతితో //

ఇట్లు

M.గంగాధరరావు
K.శివ ప్రసాద్‌రావు
Y.శ్రీనివాసులు,
S.సత్యనారాయణ

పిటిషనర్స్ తరపు న్యాయవాదులు,ఒంగోలు

సెల్‌నెం : 9866729690

నోటీసు

మహారాజశ్రీ నరసరావుపేట సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఐ.పి.నెం:85/2023

షేక్ పీరావలి, తండ్రి: మస్తాన్‌వలి........ పిటీషనర్

వర్సెస్

1. కొత్తూరి రఘువరనాయుడు, తండ్రి: శ్రీనివాసరావు ఇంటి నెం: 13-4-4/9, వెంగళరెడ్డి కాలనీ, 5వ లైన్, కోటప్పకొండ రోడ్డు, నరసరావుపేట, పల్నాడు జిల్లా, ఆంధ్రప్రదేశ్.
2. బొల్లాపల్లి విజయకృష్ణ, తండ్రి: నాయుడు ఇంటి నెం: 12-19-8,11వ వార్డు, ప్రకాష్ నగర్, నరసరావుపేట, పల్నాడు జిల్లా, ఆంధ్రప్రదేశ్.
3. కటకం చంద్రశేఖరరెడ్డి, తండ్రి: కృష్ణారెడ్డి ఇంటి నెం: 7-405, కలెక్టర్ ఆఫీసు దగ్గర, నరసరావుపేట, పల్నాడు జిల్లా, ఆంధ్రప్రదేశ్.
4. అన్నెం శివగోపి, తండ్రి: మధు, ఇంటి నెం: 162-1-4/1, ఆదిత్య అపార్ట్‌మెంట్, బరంపేట, నరసరావుపేట, పల్నాడు జిల్లా, ఆంధ్రప్రదేశ్.

పైన తెలిపిన ఐ.పి. పిటీషన్‌లో ఎవరికైనా ఎటువంటి ఆక్షేపణలు ఉన్నచో, ఆక్షేపణలు తెలుపుకొనుట కొరకు పైన తెలిపిన కోర్టులో తేదీ: 29-12-2023న ఉదయం10:30 గంటలకు హాజరై ఆక్షేపణలు కోర్టులో వ్యక్తపరచవలసినదిగా ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

వాయిదా: 29-12-2023

ఇట్లు

దొడ్డా సత్యనారాయణరెడ్డి

పిటీషనరు తరపు న్యాయవాది.

మహారాజశ్రీ **DEPUTY REGISTRAR OF CHITS, ONGOLE**

A.R.C. NO 61/2023

CCKR. Chits &Finance (P) LTD.... Ongole (వాది తరపున Asst Manager, Y Ramana Reddy) ..... వాది.

వర్సెస్

Lakkapogu Narendra Kumar & 3 Others .... ప్రతివాదులు

దావా సమన్లు

To
Opp : 2
Nanne Ram Babu S/o peraiah
Constebul (security) O/o Inspector RPF
SC. Railway station gunturu (po & md,)

పై నంబరు దావా యందు నీకు CHIT REGISTRAR గారి ద్వారా ఎన్ని పర్యాయములు నోటీసులు పంపిననూ నీవు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున CHIT REGISTRAR గారు మీకు పేపర్ ప్రకటన ద్వారా సమన్లు ఇవ్వమని ఆర్డర్ ఇచ్చినారు. కావున మీ యొక్క హాజరు నిమిత్తం తేది. 05-01-2024 నకు వాయిదా అయి ఉన్నది కనుక ఆ రోజు ఉదయం 10:30 కి మీరు స్వయంగా వచ్చి CHIT REGISTRAR గారి ఎదుట మీ యొక్క ఆక్షేపణలు ఏమైనా ఉన్న యెడల వ్రాతపూర్వకంగా తెలియజేయలేని యెడల మీకు పరోక్షముగా తీర్మానము చేయబడునని తెలియజేయడ మైనది

వాయిదా తేది : 05-01-2024

Order by
DEPUTY REGISTRAR OF CHITS ONGOLE

మహారాజశ్రీ ఒంగోలు ప్రిన్సిపల్ జిల్లా జడ్జి వారి కోర్టులో

M.V.O.P No. 249/2021

భుసా పావని మరియు ముగ్గురు .....పిటిషనర్లు

మరియు

వంగా ఎల్లారెడ్డి మరియు అయిదుగురు ... రెస్పాండెంట్స్

నోటీసు

To

ఆర్-4) సిద్ధి నారాయణమ్మ భర్త లేట్ క్రిష్ణారెడ్డి, హిందూ, వయసు 50సం.లు, గృహిణి,
ఆర్-5) సిద్ధి దిలీప్ కుమార్ రెడ్డి తండ్రి లేట్ క్రిష్ణారెడ్డి, హిందూ, వయసు 30 సం.లు, ప్రైవేట్ ఎంప్లాయ్,
ఆర్-6) సిద్ధి లావణ్య తండ్రి లేట్ క్రిష్ణారెడ్డి, హిందూ, వయసు 26 సం.లు, గృహిణి, పై ముగ్గురి నివాసం ఇంటి నెం.7-4-30, మల్లమ్మ సెంటర్, నరసరావుపేట పట్టణం, పల్నాడు జిల్లా.

పై నెంబరు కేసును పిటిషనర్లు తమ కుటుంబ సభ్యుడైన భుసా సత్యనారాయణరెడ్డి ఆక్సిడెంట్ లో మరణించిన కారణముగా నష్ట పరిహారము కోరుచూ రెస్పాండెంట్ల పై పిటిషనర్లు పిటిషను దాఖలు చేసినారు. సదరు కేసులో రెస్పాండెంట్లు 4 నుండి 6 వరకు శ్రీ కోర్టు వారి ద్వారా అనేక పర్యాయములు నోటీసులు పంపిననూ తీసుకొనక, కాలయాపన చేయుచున్న కారణముగా శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు, పత్రికా ముఖముగా నోటీసులు జారీ చేయుటకు అనుమతి పొందిరి. పై కేసు తేదీ.30-01- 2024కు వాయిదా ఉన్నది. కావున పై తెలిపిన రెస్పాండెంట్లు 4 నుండి 6 వరకు శ్రీ కోర్టు వారి ఎదుట తేదీ 30-01-2024న ఉదయం 10.00 గంటలకు స్వయంగా గానీ లేదా ప్లీడరు గారి ద్వారా గానీ, హాజరై తమ అభ్యంత రములు తెలియపరచుకోవలసినది, లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడ మైనది.

ఒంగోలు,
23-12-2023.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

ఇట్లు :

సయింపు వెంకటమల్లిఖార్జునరావు
పి.బ్రహ్మయ్య
ఏ.రవి కుమార్
టి.సుకన్యా దేవి
సయింపు ప్రదీప్ చంద్రచౌదరి

న్యాయవాదులు, గోల్డెన్ టవర్స్, జిల్లా కోర్టు ఎదురు, ఒంగోలు, సెల్ .9848240802

రెండో ప్రయత్నం.. విజయవంతం..

ఎస్సైగా ఎంపికైన జగ్జీవన్‌రావు

ప్రజాశక్తి-పెదకూరపాడు

మండలంలోని తాళ్లూరు గ్రామానికి చెందిన కుంభా జగజ్జీవన్ రావు ఎస్సైగా సెలెక్ట్ అయ్యాడు. ఎస్టి రిజర్వులో ఎంపికైన ముగ్గురులో పల్నాడు జిల్లాలో ఎంపికైన ఏకైక అభ్యర్థిగా జగజ్జీవన్ రావు నిలిచారు. తల్లితండ్రులు కుంభా శ్రీను,నాగమల్లేశ్వరి వ్యవసాయ కూలీ పనులు, పరదా పట్టలు అమ్మకం చేస్తుండగా, తమ్ముడు వెంకట్రావు వాలం టీరుగా పనిచేస్తున్నాడు. 75 త్యాళ్లూరు జడ్ పి హైస్కూల్ లో 2009.10 లో 10వతరగతి పూర్తి చేసి, నరసరావుపేట ఎస్ ఎన్ కాలేజీలో బి.కాం పూర్తిచేశాడు. గతంలో ఒకసారి అన్ని అర్హతలు సాధించినప్పటికీ ఇంట ర్వ్యూలో స్వల్పతేడాతో ఆగి పోయాడు. ఎస్ఐ గా సెలెక్ట్ అయ్యాకే గ్రామానికి తిరిగి రావాలనే పట్టుదలతో శిక్షణ పొంది నట్లు, ఉన్నత లక్ష్యానికి పేదరికం అడ్డుకాదని జగజ్జీవన్ రావు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పోలీస్ అకాడమీలో శిక్షణ అనంతరం పోస్టింగ్ ఉంటుందని తెలిపారు. జగజ్జీవన్ ఎంపికపై స్థానిక పెద్దలు,బంధుమిత్రులు అభినందనలు తెలిపారు.

ధాన్యం తూకాన్ని పరిశీలిస్తున్న ఏడి ఎన్.శీనివాసరావు

పంట కోత ప్రయోగం

ఎకరాకు 35 నుండి 40 బస్తాల దిగుబడి

ప్రజాశక్తి-ఈపూరు

మిచాంగ్ తుఫాను ప్రభావంతో వరి పంట కొంతమేర దెబ్బతిన్నప్పటికీ పంట కోత ప్రయోగాల నిర్వహణలో ఎకరాకు 35 నుండి 40 బస్తాల దిగుబడి అంచనాలు వస్తున్నట్లు పల్నాడు జిల్లా ఎడి ఎన్ శ్రీనివాసరావు అన్నారు. మండలం లోని గ్రామ వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పంట కోత ప్రయోగాలను సోమవారం ఆయన పర్యవేక్షణలో సిబ్బంది చేపట్టారు. వనికుంట గ్రామానికి చెందిన బమ్మినిడి శాంతయ్య వరి పొలంలో నిర్దేశించిన కొలతల ప్రకారం పంట కొత్త ప్రయో గంలో ఎకరాకు 38 బస్తాలు దిగుబడి వచ్చినట్లు అధికారులు అంచనా వేశారు. కార్యక్రమంలో ఏ ఎస్ ఓ నాగ శ్రీనివాస రావు, ఏఈఓ అప్పారావు, గ్రామ వ్యవసాయ సహాయకులు ఆనంద్ పాల్గొన్నారు.

నందిగామ కళాకారిణికి తెలంగాణ 'నంది'

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

బంగారు నంది అవార్డుతో సంగీత కళాకారిణి ఆళ్ళ రాజేశ్వరి

సత్తెనపల్లి మండలం నందిగామ గ్రామానికి చెందిన సంగీత కళాకారిణి ఆళ్ళ రాజేశ్వరి నంది అవార్డు అందు కున్నారు. హైద రాబాద్ కు చెందిన వల్లూరి పౌండేషన్ వివిధ రంగాల్లో నిష్ణాతులైన కళాకారులకు అవార్డులు అందచేశారు. హైదరాబాద్ రవీంద్ర భార తిలో ఆదివారం జరిగిన కార్య క్రమంలో ఆళ్ళ రాజేశ్వరికి నందీ అవార్డును ప్రదానం చేశారు. ఆళ్ళ రాజేశ్వరి మ్యూజిక్ ఆర్టిస్టుగా పేరు పొందారు. మ్యూజిక్ ఆర్టిస్టుగా గా గుర్తించిన ఫౌండేషన్ బంగారు నంది అవార్డుతో సత్క రించారు. నందీ అవార్డు అందుకున్న రాజేశ్వరిని బాలవికాస్ స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ పేరయ్య, గ్రామస్తులు అభినందించారు.

ఆకులు తింటూ నిరసన

వినుకొండలో ఆకులు తింటూ నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి - వినుకొండ

స్థానిక సురేష్ మహల్ రోడ్డులో అంగన్వాడీ నిర్వహిస్తున్న సమ్మె 14వ రోజుకు చేరింది. రేపటి నుండి సమ్మెను మరింత ఉధృతం చేసేలా నిర్ణయాలు జరుగుతాయని, ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి అంగన్వాడీలకు న్యాయం చేయాలని అన్నారు. రాష్ట్రంలోని అంగ న్వాడీలు ఆగ్రహానికి గురికాక తప్పదని వారు హెచ్చరించారు. ప్రభుత్వం ఇచ్చే జీతానికి ఆకులు, అలములు తప్ప ఇంకేం మిగిలాయని తెలియజేస్తూ రోడ్డుపై అర్ధ చంద్రాకారంలో కూర్చొని ఆకులు తింటూ వినూత్న రీతిలో నిరసన తెలియ జేశారు. కార్యక్రమానికి సిఐటియు నుండి హనుమంతరెడ్డి, మాజీ పౌర హక్కుల సం ఘం నాయకులు, ప్రముఖ న్యాయవాది సిహెచ్‌ఎన్‌ఎల్ మూర్తి, ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మహంకాళి సుబ్బా రావులు ప్రసంగించారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా అధ్యక్షుడు ఎల్ ప్రసన్న కుమారి, నాగజ్యోతి, కృష్ణకుమారి ,సుజాత, అంగలకుదురు ఆంజనేయులు, ప్రాజెక్ట్ అధ్యక్షుడు కార్యదర్శులు జి.పద్మ, బి. శ్రీదేవి , ఏఐటీయూసీ నుండి పి. ఉమాశంకరి, ఉమామహేశ్వరి, రమాదేవి, నీరజ పాల్గొని నిరసన తెలిపారు.

మాచర్లలోని అంబేద్కర్ సెంటర్‌లోని శిబిరంలో ..

ప్రజాశక్తి-మాచర్ల

అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్ల పరిష్కారంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభు త్వం వెంటనే ప్రత్యేక చొరవ తీసుకోవాలని అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు ఉషారాణి కోరారు. పట్టణంలోని అం బేద్కర్ సెం టర్‌లో ఏర్పాటు చేసిన శిబి రాన్ని సోమవారం ఉదయం ప్రారం భించిన ఉపారాణి సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ డిమాండ్లు గొం తెమ్మ కోర్కేలు కాదన్నారు. ప్రస్తుత ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు పాదయాత్రలో తమకు ఇచ్చిన హామీ మేరకు అమలు చేయాలన్నారు. తమపై ప్రభుత్వం పంతానికి పోకుండా, సమ స్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలకు రూ . 26 వేలు, హెల్పర్లకు రూ.18 వేలుగా జీతాలను ప్రభుత్వం ప్రకటించాలన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం వారికి గ్రాడ్యూటీ ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న సెంటర్ల అద్దెలు, 2017 నుండి టిఎ బిల్లులు, ఇతర బకాయిలు వెంటనే ఇప్పిం చాలని, చిరు ఉద్యోగులమైన తమకు ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నింటిని వర్తింప చేయా లని, వేతనంతో కూడిన మెడికల్ లీవ్ సౌకర్యం కల్పించాలని, మొదలైన డిమాండ్లు చేశారు. కార్యక్రమంలో అంగన్ వాడీ యూనియన్ నాయ కులు ఇం దిరా, కాకర్ల పద్మావతి, కోటేశ్వరి, సుందం´లీల, శారద, దుర్గా శివలక్ష్మీ, నాగేంద్రం, చాంద్ బి, రుక్మిణి, మహాలక్ష్మీ, శివపార్వతి, జిజి భాయ్, రహేనా, చంద్ర కళ, లీలావతి, వెంకట రమణ, నాగలక్ష్మీ, రాధ, హైమవతి పాల్గొన్నారు.

ప్రజాశక్తి-సత్తెనపల్లి

సత్తెనపల్లిలోని తాలూకా సెంటర్‌లోని శిబిరంలో పొర్లుదండాలు పెడుతున్న అంగన్వాడీలు

స్థానిక తాలూకా సెంటర్లో ఏర్పాటు ాచేసిన సమ్మె శిబిరంలో అంగన్వాడీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంగన్వాడీ లంతా 'మా మొర ఆలకించు మహాప్రభు 'అంటూ పొర్లుదండాలు పెట్టి వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ లెటర్లు భవాని, పద్మ, కమల, జమీల సత్తెనపల్లి ముప్పాళ్ళ రాజుపాలెం మండలాలకు చెందిన అంగన్వాడి టీచర్లు హెల్పర్స్ అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

పిడుగురాళ్లలో రిలే నిరాహారదీక్షల్లో పాల్గొన్న అంగన్వాడీలు

అంగన్వాడి సమస్యల పరి ష్కరించాలని కోరుతూ రిలే దీక్షలు అంగన్వాడి ప్రాజెక్టు డి.శాంతమని రిలే దీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత 14 రోజులుగా అంగన్వాడీలు సమ్మె నెరవేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్రపోతోందని,. అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరించకపోతే ఈ సమ్మెను ఉధృతం చేస్తామని ఆమె ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అంగన్వాడీ ల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. దీక్షా శిబిరంలో సిఐ టియు మండల కార్యదర్శి తెలకపల్లి శ్రీనివాసరావు, అంగన్వాడీ యూనియన్ ప్రాజెక్ట్ అధ్యక్షురాలు షేక్ హజ్రా, అంగన్వాడీలు ఎస్ ఇందిరా, పద్మావతి ,హేమలత, అరుణ, మాధవి, నాగమణి, అరుణకుమారి, రామా రూతమ్మ, శివ పార్వతి, వెంకట రమణ, శివరంజని ధనలక్ష్మి , శ్రీలక్ష్మి , లక్ష్మీ దుర్గ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థికసాయం

ప్రజాశక్తి- నూజెండ్ల

నూజెండ్ల మండలం పాత నాగిరెడ్డిపల్లి గ్రామంలో శనివారం నాడు గ్యాస్ సిలిండర్ పేలి రెండు రేకులతో ఉన్న గహాలు బాధితులు దార బోయిన శ్రీరామమూర్తి వెంకటరావుల గహాలు పూర్తిగా దగ్ధమైనాయి. ఈ సమాచారాన్ని గ్రామంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు ద్వారా తెలుసుకున్న శివశక్తి లీలాంజన ఫౌండేషన్ వ్యవస్థాపకులు వినుకొండ మాజీ శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు స్పందించి బాధితులకు నాగిరెడ్డిపల్లి గ్రామమునకు వెళ్లి బాధితులను పరామర్శించి వారికి సోమవారం నాడు ఆర్థిక సాయం, వంట సామాగ్రి, బట్టలు , బియ్యం అందించడం జరిగింది. ఈ సందర్భంగా జీ.వి ఆంజనేయులు మాట్లాడుతూ వారిని ఆర్థికంగా ఆదుకోవాలని ప్రభుత్వం ఇల్లు మంజూరు చేసి త్వరగా పూర్తిచేసి ఇవ్వాలని ఉన్నారు లేనిపక్షంలో బాధ్యతలు తరపున న్యాయపోరాటం చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మీసాల మురళీ కష్ణ యాదవ్, తెలుగుదేశం పార్టీ,జనసేన నాయకులు పాల్గొన్నారు

టివి టెక్నీషియన్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - వినుకొండ

స్థానిక ఏనుగుపాలెం రోడ్డులోని మిర్చి యార్డ్ లో నియోజకవర్గ టివి టెక్నీషియన్ వెల్ఫేర్ అసో సియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక, ఆత్మీయ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర నాయకులు , జిల్లా నాయకులు ముఖ్య అతిథులు గా విచ్చేశారు. ఆత్మీయ సమావేశం అనంతరం వారి ఆధ్వర్యంలో నియోజకవర్గ టీవీ టెక్నీషియన్ల ఎన్నిక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీవీ టెక్నీషియన్స్ అందరూ ఉత్సాహంగా పాల్గొని తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

అసోసియేషన్ అధ్యక్షులుగా గా దద్దాల ఆంజనేయులు, వైస్ ప్రెసిడెంట్ గా భాస్కర్, కార్యదర్శి గా సిహెచ్. చిన్న, జాయింట్ సెక్రటరీ గాఎమ్.శ్రీనివాస్, ట్రెజరర్ గా జయరావు లను ఎనుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నుకోబడిన కార్యవర్గాన్ని రాష్ట్ర మరియు జిల్లా నాయకులతో పాటు సంఘ సభ్యులు ఘనంగా సత్కరించారు.

కొల్లిపర

తుళ్లూరు


పెదనందిపాడు

సమ్మె శిబిరాల్లోనే క్రిస్మస్ సంబరాలు

14వ రోజుకు అంగన్వాడీల సమ్మె - బహుముఖ రూపాల్లో నిరసనలు - ప్రభుత్వం స్పందించే వరకూ ఉద్యమిస్తామన్న అంగన్వాడీలు

తమ సమస్యల పరిష్కారం కోసం అంగన్వాడీలు చేపట్టిన సమ్మె క్రిస్మస్ పండగ రోజైన సోమవారమూ కొనసాగింది. 14వ రోజు బహుముఖ రూపాల్లో నిరసనలు తెలిపిన అంగన్వాడీలు పలుచోట్ల సమ్మె శిబిరాల్లోనే క్రిస్మస్ వేడుకలు చేసుకున్నారు.

ప్రజాశక్తి-తెనాలిరూరల్

స్థానిక విఎస్ఆర్ కళాశాల ఎదురుగా నిర్వహిస్తున్న అంగన్వాడీ సమ్మె శిబిరంలో చేపట్టిన రిలే దీక్ష మూడవరోజుకు చేరుకుంది. సెల్‌ఫోన్లు, చీరలకు పూజలు చేసిన అంగన్వాడీలు వినూత్నంగా నిరసన తెలిపారు. అంగన్వాడీలు దరిస్తున్న యూనిఫామ్, ఫోన్లు, వాటి రీఛార్జ్‌లకు రూ.100 కోట్లు ఖర్చుచేశామంటూ స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీ చరణ్ చెప్పడం బాధకరమని విమర్శించారు. నాసిరకమైన ఫోన్లు, దుస్తులను పంపిణీ చేసి దళారులు సొమ్ముచేసుకున్నారని, అటువంటి నాసికరమైన ఫోన్, వస్త్రాలు తమకొద్దని అన్నారు. ఇదిలా ఉండగా దీక్షా శిబిరం వద్దకు చేరుకున్న కార్యకర్తల బంధువులు పండ్లరసం ఇచ్చి వారిని రిలే దీక్ష విరమింపజేశారు. సిఐటియు, సిపిఎం నాయకులు కె.బాబూప్రసాద్, షేక్ హుస్సేన్‌వలి, అంగన్వాడీ నాయకులు ఎవిఎన్ కుమారి, పావని, ఎలిజిబెత్, రంగా, పుష్ప పాల్గొన్నారు.

తెనాలి శిబిరంలో సెల్‌ఫోన్లు, చీరకు పూజ ద్వారా నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి-తాడేపల్లి

అంగన్‌వాడీల డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించకపోతే అన్ని ప్రజాసంఘాలను కలుపుకుని ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని సిఐటియు గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజీ హెచ్చరించారు. తాడేపల్లి తహశీల్దార్ కార్యాలయం సమీపంలోని అంగన్‌వాడీల సమ్మె శిబిరాన్ని ఆయన సోమవారం ప్రారంభించి మాట్లాడారు. అంగన్‌వాడీల సమస్యల పట్ల ప్రభుత్వ తీరును ఖండించారు. తాము గొంతెమ్మ కోరికలు కోరడంలేదని, ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయమని కోరుతున్నామని అన్నారు. సుప్రీం కోర్టు ఆదేశాలను అమలు చేయాలని కోరారు. అవసరంలేని అనవసరమైన యాప్‌లను ఉపయోగించి అంగన్‌వాడీల మీద పని భారం పెంచొద్దన్నారు. అంగన్‌వాడీ సెంటర్ల తాళాలు పగలగొట్టడం సరికాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసి తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. యూనియన్ గౌరవాధ్యక్షులు వి.దుర్గారావు, వైదేవి, సుజాత, రమణ, ఫాతిమ, నాగసుభాషిణి, వెంకటలక్ష్మి, సబిత పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తుళ్లూరు

సమ్మె శిబిరంలోనే అంగన్వాడీలు క్రిస్మస్ వేడుకలు చేసుకున్నారు. సిఐటియు రాజధాని డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.రవి, ఎం.భాగ్యరాజు కేక్‌కట్ చేసి మాట్లాడారు. పండగ రోజుకూడ అంగన్వాడీలను ప్రభుత్వం రోడ్డెక్కించిందని, అంగన్వాడీల పట్ల సిఎం జగన్‌కు దయ, జాలి, కరుణ లేదని విమర్శించారు. అంగన్వాడీ కేంద్రాల తాళాలు పగలగొట్టించి ఏమి ఉద్ధరించారని ప్రశ్నించారు. సమస్యలు పరిష్కరించకపోగా అంగన్వాడీలపై మంత్రులు విషం కక్కడం దుర్మార్గమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరి వల్ల అనేక రంగాల్లో కార్మికులు, ఉద్యోగుల సైతం సమ్మె బాట పట్టనున్నారని చెప్పారు. కార్మికులను ఇబ్బంది పెట్టిన ఏ ప్రభుత్వం బతికి బట్టకట్టలేదనే విషయం గుర్తించాలని, సమస్యల పరిష్కారానికి పూనుకోవాలని కోరారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ మండల కార్యదర్శి షేక్ కరీమూన్, నాయకులు రజిని, విజయలక్ష్మి, కరుణ, శంషాద్, తనూజ, షేక్ జానీబేగం, వి.నాగమల్లేశ్వరి, సీత, ఎం.రత్నకుమారి, ప్రభ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - దుగ్గిరాల

పండుగ పూట కూడా రోడ్డుమీద ధర్నా చేయాల్సి వచ్చిందని అంగన్వాడీలో వాపోతున్నారు. దుగ్గిరాలలో సమ్మెను కొనసాగించారు. శివపార్వతి, వెంకటేశ్వరమ్మ, అంబికా, ఉష, రిజ్వానా పాల్గొన్నారు. వీరికి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జె.బాలరాజు, నాయకులు శ్రీనివాసరావు మద్దతు తెలిపారు.

ప్రజాశక్తి - మంగళగిరి

స్థానిక అంబేద్కర్ సెంటర్లో సమ్మె శిబిరం కొనసాగుతోంది. సిఐటియు నాయకులు ఎస్ఎస్ చెంగాయ్య, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.బాలకృష్ణ, అంగన్వాడీ యూనియన్ నాయకులు వినీల, రుక్మిణి, మేరీ రోజమ్మ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్

స్థానిక సమ్మె శిబిరంలో క్రిస్మస్ వేడుకలు చేసుకున్నారు. సిఎం మనసు మారాలని కోరుతూ ప్రార్థనలు చేశారు. యూనియన్ మండల అధ్యక్షులు శివపార్వతి, కార్యదర్శి శ్రీదేవి, అంగన్వాడీలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తాడికొండ

సమ్మెలో భాగంగా మోకాళ్లపై నిలిచి చెవులు మూసుకుని నిరసన తెలిపారు. సిఐటియు నాయకులు యడ్లపలి గాంధీ రాంమోహనరావు, రైతు సంఘం నాయకులు చింతల భాస్కరరావు మద్దతు తెలిపారు. ఫిరంగిపురంలో సమ్మె కొనసాగింది.

ప్రజాశక్తి-కొల్లిపర

మండల కేంద్రమైన కొల్లిపరలో చేస్తున్న సమ్మె కొనసాగుతోంది. శిబిరంలోనే అంగన్వాడీలు తమ కుటుంబ సభ్యులతో కలిసి క్రిస్మస్ కేకును కట్ చేశారు. రైతు సంఘం నాయకులు ఎం.శివసాంబిరెడ్డి, కె.చంద్రశేఖర్, అంగన్వాడీలు మాధవి, లత, నిర్మల, జ్యోతి, ధనలక్ష్మి, శివపార్వతి, నాగ పద్మ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్

స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సమ్మె శిబిరంలో అంగన్వాడీలు మోకాళ్లపై నిలిచి దండం పెడుతూ నిరసన తెలిపారు. సిఐటియు నాయకులు ఎన్.రమేష్‌బాబు మాట్లాడారు. యూనియన్ అధ్యక్షులు ఎంవి.సుకన్య, కార్యదర్శి పద్మజ, నాయకులు విజయలక్ష్మి పాల్గొన్నారు.

తాడికొండ

పొన్నూరు

తాడేపల్లి

మంగళగిరి

దుగ్గిరాల

బ్రహ్మయ్య భౌతికకాయం వద్ద నివాళు లర్పిస్తున్న సిపిఎం, టిడిపి, వైసిపి నాయకులు... బ్రహ్మయ్య (ఫైల్ ఇన్‌సెట్)

సిపిఎం మాజీ సభ్యులు బ్రహ్మయ్య మృతి

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్ : మండలంలోని ప్రాతూరుకు చెందిన సిపిఎం మాజీ సభ్యులు కావూరి బ్రహ్మయ్య (63) ఆదివారం సాయంత్రం మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలున్నారు. బ్రహ్మయ్య భౌతికకాయాన్ని ఆయన నివాసంలో సిపిఎం సీనియర్ నాయకులు జొన్న శివశంకరరావు, మండల కార్యదర్శి డి.వెంకటరెడ్డి సోమవారం సందర్శించి నివాళులర్పించారు. వెంకటరెడ్డి మాట్లాడుతూ బ్రహ్మయ్య ప్రాతూరులో సిపిఎం అభ్యున్నతి కోసం ఎనలేని కృషి చేశారని అన్నారు. గతంలో సిపిఎం సర్పంచులుగా పనిచేసిన డోకిపర్తి చలపతిరావు, చౌక్కా ఆశీర్వాదంతో పాటు గ్రామంలో జరిగే పలు అభివృద్ధి కార్యక్రమాల్లో బ్రహ్మయ్య చురుకుగా పాల్గొనేవారని గుర్తు చేశారు. బ్రహ్మయ్యకు నివాళులు అర్పించిన వారిలో సిపిఎం ప్రాతూరు గ్రామ శాఖ కార్యదర్శి డి.రాజేంద్రబాబు, సిహెచ్.మరియదాసు, టిడిపి గ్రామ అధ్యక్షులు ఎ.శ్రీనివాసరావు, వైసిపి నాయకులు ఆర్.సత్యనారాయణరెడ్డి, వి.నాగిరెడ్డి, పి.కోటేశ్వరరావు, ఎస్.మరియబాబు, టిడిపి నాయకులు బి.రాజు, సిహెచ్.ఫ్రాన్సిస్, కె.నరసింహారావు, కె.ఏసు ఉన్నారు.

మైదానాన్ని పరిశీలిస్తున్న ఎంపిపి సంతోష రూపవాణి

ఆడుదాం ఆంధ్రాకు 6964 మంది నమోదు

ప్రజాశక్తి - దుగ్గిరాల : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలు జయప్రదం చేయాలని ఎంపిపి డి.సంతోష రూపవాణి కోరారు. స్థానిక జెడ్పి బాలుర పాఠశాలలో మైదానాన్ని ఆమె సోమవారం పరిశీలించారు. ఈ పోటీల్లో రాజకీయాలకు అతీతంగా అందరూ పాల్గొనాలన్నారు. మండల వ్యాప్తంగా ఇప్పటి వరకు 6964 మంది నమోదు చేసుకున్నారని, వీరిలో పురుషులు 3449, మహిళలు 3515 మంది ఉన్నారని చెప్పారు. చిలువూరులో అత్యధికంగా పురుషులు 766, మహిళలు 42 మంది నమోదు చేసుకోగా కంఠంరాజు కొండూరులో అత్యల్పంగా పురుషులు 311 మంది, మహిళలు 162 మంది నమోదు చేసుకున్నట్లు వివరించారు. మొత్తం వివిధ ఆటల పోటీల్లో 448 జట్లు పాల్గొన్నట్లు తెలిపారు. పరిశీలనలో వైసిపి జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు డి.వెంకటేశ్వరరావు, ఉపసర్పంచ్ షేక్ నాగూర్ షేక్ బాజీ, టి.వెంకటరావు, ఎన్.లోకేష్ పాల్గొన్నారు.

పాస్టర్లకు టిడిపి క్రిస్మస్ కానుక

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్ : క్రిస్మస్ సందర్భంగా టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ సహకారంతో చిర్రావూరులోని 11 చర్చిల పాస్టర్లకు నూతన వస్త్రాలను నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు వి.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి పి.రమేష్ పాల్గొన్నారు.

పుల్లారావు సమక్షంలో 'జనసేన'లోకి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

చిలకలూరిపేట నియజకవర్గం నాదెండ్ల మండలం ఇర్లపాడు గ్రామానికి చెందిన గణపవరం సొసైటీ మాజీ ప్రెసిడెంట్, ప్రస్తుతానికి ఇర్లపా డు ఎంపిటిసి భర్త, వైసిపి నాయకులు ఆలూరి రమణయ్య జనసేన పార్టీలో చేరారు. మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు సమక్షంలో పుల్లారావు నివాసంలో సోమవారం జనసేన నియోజకవర్గ సమన్వయ కర్త తోట రాజారమేష్, రమణయ్యకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పుల్లారావు మాట్లాడుతూ జగన్ పాలనపై ప్రజలు, ఆ పార్టీ నాయకులు విసుగు చెందారని అన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ నెల్లూరి సదాశివరావు, జనసేనపార్టీ నాయకులు షేక్ మునీర్ హసన్, లీలా కిషోర్, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

కాపు జెఎసి గౌరవాధ్యక్షులుగా బ్రహ్మానాయుడు

ప్రజాశక్తి-విజయపురిసౌత్

మాచర్ల నియోజకవర్గ కాపు జేఏసీ గౌరవ అధ్యక్షులుగా మాచర్ల మండలం తాళ్లపల్లికి చెందిన పసుపులేటి బ్రహ్మనాయుడును నియమించినట్లు జేఏసీ చైర్మన్ అమ్మ శ్రీనివాస్ నాయుడు తెలిపారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గానికి చెందిన పలువురు కాపు నేతలు, సంఘీయులు బ్రహ్మానాయుడుకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా బ్రహ్మానాయుడు మాట్లాడుతూ నియోజకవర్గ కాపు జేఏసీ గౌరవాధ్యక్షులుగా నియమించడంపై సంతోషకరంగా ఉందన్నారు. కాపు సామాజికవర్గం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో పదవిని కేటాయించిన అమ్మ శ్రీనివాస్ నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. బ్రహ్మానాయుడుకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

గుల్జర్ సంస్మరణ సభ కరపత్రం ఆవిష్కరణ

ప్రజాశక్తి-నకరికల్లు

గుల్జర్ సంస్మరణ సభ కరపత్రాన్ని నకరికల్లులో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పిడిఎం జిల్లా అధ్యక్షుడు షేక్ మస్తాన్వలి మాట్లాడుతూ వినుకొండకు చెందిన గుల్జర్ ఈ నెల 20వ తేదీన అనారోగ్యంతో మృతి చెందారని, పీడిత ప్రజలు, ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీల కోసం ఎన్నో పోరాటాలు చేశారన్నారు. ఈ నెల 27వ తేదీన వినకొండ కమ్యూనిస్టు పార్టీ ఆఫీసులో సంస్మరణ సభ జరుగుతుందని చెప్పారు. ఈ సభకు జిల్లాలోని ప్రజా సంఘాల, వామపక్ష పార్టీల నాయకులు మైనార్టీ సంఘాల ప్రతినిధులు పాల్గొనాలని పిలుపు నిచ్చారు. కరపత్రం ఆవిష్కరించిన వారిలో పిడిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కె. శ్రీనివాస రావు, సిపిఐ నాయకులు కృష్ణ నాయక్, మహిళా సంఘం నాయకురాలు పి.సుజాత తదితరులు పాల్గొన్నారు.

నేడు సాయి మందిరంలో దత్త జయంతి

ప్రజాశక్తి-విజయపురిసౌత్

స్థానిక శ్రీ సత్యసాయి ప్రేమ మందిరంలో దత్త జయంతి వేడుకలను నేడు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త కె.శ్రీహరి ప్రసాద్ సోమవారం తెలిపారు. ఉదయం 5:15 గంటలకు కాగడ హారతి,6 గంటలకు మంగళ స్నానము, ఉదయం 10 గంటలకు పల్లకి ఊరేగింపు జరుగుతుందన్నారు.

మొగ్గు చూపుతున్నా.. కొరవడిన ప్రోత్సాహం

- గొర్రెల పెంపకం లాభదాయకం
- జీవాల పెంపకమే జీవనాధారం... రాయితీలు, రుణాలు ఇవ్వండి : పెంపకందారులు

ప్రజాశక్తి పల్నాడు జిల్లా

వ్యవసాయ అనుబంధ రంగాల్లో పాడి పరిశ్రమ తర్వాత ప్రధానంగా మెట్ట ప్రాంత రైతులకు జీవాల పెంపకం జీవనాధారంగా మారింది. ఒకప్పుడు కుల వృత్తిగా ఉన్న జీవాల పెంపకం ప్రస్తుతం వాణిజ్య పరంగా మారింది. చిన్న, సన్న కారు, భూమి లేని పేద రైతులు దగ్గర నుండి చిరు వ్యాపారం చేసుకుంటున్న వారు నిరుద్యోగ యువత సైతం జీవాల పెంపకంపై ఆసక్తి చూపుతున్నారు. గ్రామాల్లోనే రైతులు జీవాలు పెంచుకుంటూ ఆర్థిక స్వావలంబన పొందుతున్నారు. గతంలో జీవాలను ఆరుబయట ప్రాంతాలలో తిప్పి పెంచేవారు. ప్రస్తుతం షెడ్లలో పెంచుతూ కృత్రిమ దాణా అందజేస్తూ పెంచుతున్నారు. అయినప్పటికీ మేలు జాతి జీవాలు ఎంపిక ద్వారా వీటి పెంపకం లాభసాటిగానే ఉంటుందని, అయితే ప్రభుత్వ ప్రోత్సాహమే కొరవడిందని పెంపకందారులు చెబుతున్నారు. ప్రస్తుతం వర్షాలు లేక సాగునీరు లేక కరువు తాండవిస్తున్న సమయంలో కూడా కొంతమేర ఆర్ధికాభివృద్ధి సాధిస్తున్నారు. ప్రస్తుతం పల్నాడు జిల్లాలో తక్కువ వర్షపాతం నమోదు కావడంతో మెట్ట ప్రాంతాలతో పాటు అటవీ పరిసర ప్రాంతాలతో పాటు ప్రధానంగా కొండ ప్రాంతాలు ఎక్కువగా ఉన్న వినుకొండ, బొల్లాపల్లి, ఈపూరు, మాచర్ల, నరసరావుపేట తదితర ప్రాంతాల రైతులు గొర్రెల పెంపకం వైపు మొగ్గు చూపుతున్నారు. గొర్రెల ద్వారా లభించే ఉన్ని, మాంసము,ఎరువు మొదలైన ఉత్పత్తుల అమ్మకాలకు మార్కెట్ లో గిరాకీ ఉండడంతో ప్రత్యక్షంగా,పరోక్షంగా ఎంతో మంది లబ్ది పొందుతున్నారు. గొర్రెల ఎరువుకు సైతం అత్యంత గిరాకీ ఉన్న సంగతి తెలిసిందే. పెంపకానికి ఎక్కువ ఖర్చుతో నిర్మిం చిన షెడ్లు అవసరం లేకుండా తాటి లేదా రాతి స్తంభాలపై వెదురు బొంగులు, జమ్ము, రెల్లు, తాటాకులతో నిర్మిం చిన పాకలు అనువుగా ఉంటాయని జీవాల పెంపకం దారులు చెబుతున్నారు.

గొర్రెలలో రకాలు..

పల్నాడు జిల్లాలో మేలు జాతులైన నెల్లూరు, మెచేరి, చెన్నై రెడ్, రామనాథపురం వైట్, కీజక్ రాశిల్, వెం బూర్, నీలగిరి, తిరుచ్చిబ్లాక్, కోయం బత్తూరు, డెక్కన్ వంటి జాతుల గొర్రెల పెంపకం ఎక్కువగా ఉందని, ఇటువంటి రకాలను ఎంపిక చేసుకుంటే లాభదాయకంగా ఉంటుందని పెంపకం దారులు చెబుతున్నారు. విత్తన పొట్టేలు మేలు జాతి లక్షణాలతో లైంగిక శక్తి కలిగి ఉంటుదని, డెక్కన్ జాతి పొట్టేలు 20 నుండి 30 కిలోలు, నెల్లూరు జాతి 30 నుంచి 40 కిలోల బరువు ఉంటుందని చెబుతున్నారు.

ప్రభుత్వ ప్రోత్సాహం అవసరం

మర్రి నాగేశ్వరరావు

గొర్రెల పెంపకం దారులకు ప్రభు త్వం చేయూత నం దించాలని నరసరావుపేట మం డలం గుర వాయపాలెంకు చెందిన రైతు మర్రి నాగేశ్వరరావు చెప్పారు. తంతరాలుగా జీవాల పెంపకం ద్వారా జీవనోపాధి పొందుతున్నామని, జీవాలకు ఏమైనా వ్యాధులు సోకితే మందుల దుకాణాలకు వెళ్లాల్సి వస్తుందని, సీజనల్ వ్యాధుల బారిన పడి జీవాలు మత్యువాత పడుతున్నాయి. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఎప్పటికప్పుడు పశు వైద్యులు జీవాల పెంపకం దారులకు అవగాహన కల్పించడం ముందుగానే మందులు వ్యాధి నిరోధక టీకాలు ఇచ్చి ప్రోత్సాహించాలని అన్నారు.

మేపుకునేందుకు స్థలం కేటాయించండి

శ్రీరాములు

ప్రతి పంచాయతిలో గొర్రెలను మేపు కునేందుకు కొంత ప్రభుత్వ స్థలాన్ని కేటా యించి సొంత భూమిలేని జీవాల పెంపకం దారులకు చేయూత నివ్వాలని అల్లూరివారిపాలెంకు చెందిన శ్రీరాములు అన్నారు.భూమి లేని తాము జీవాల మేతకు రైతుల ఖాళీ పొలాల్లోకి వెళ్లాల్సి వస్తుండటతో తమను దుర్భాషలాడుతున్నారు. వడ్డీ లేని రుణాలు, రాయితీపై గొర్రెలు, మేలు జాతి విత్తన పొట్టేళ్ల పంపిణీ చేయడం వలన రైతులకు మేలు జరుగుతుందన్నారు. మందులు ఉచితంగా ఇవ్వడంతోపాటు అన్ని విధాలా ప్రభుత్వం ప్రోత్సహించాలి.

పాలంలో మేత మేస్తున్న పొట్టేళ్లు

సమగ్ర యాజమాన్య పద్ధతులు ముఖ్యం

పొట్టేలుకు బీమా చేస్తున్న డాక్టర్ సాయి మహేష్ రెడి

పెంపకం దారులు ఉత్తమ యాజ మాన్య పద్ధతులు పాటించాల్సిన అవసరం ఉందని రొంపి చర్ల లోని కర్లకుంట పశు వైద్యులు, డాక్టర్ సాయి మహేష్ రెడ్డి అన్నారు. ప్రదానంగా జీవాల మేతకు కోఫోర్, వేప కొమ్మలు, సుబాబుల్ ఆకులు, హెడ్జ లూజర్ వంటి గ్రాసాలతో పాటు జొన్నలు, మొక్క జొన్నలు, బియ్యం నూక పెడితే జీవాలు ఆరోగ్యంగా ఉం టాయి. సమయానుకూలంగా మేత, నీరు అందించడం, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రక్షణకల్పించడం, వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టడం అవసరమన్నారు. విత్తనానికి ఎంపిక చేసే పొట్టేలు వయసు కనీసం 18 నెలలు నిండి ఉండాలి. ప్రతి 20 నుంచి 30 గొర్రెలకు ఒక పొట్టేలు చొప్పున మందలో ఉంచాలని సూచించారు. పొట్టేలు ధృఢంగా జీవతకళ ఉట్టి పడుతూ,కళ్లు మెరుస్తూ కాలు నిటారుగా, బలంగా గిట్టలతో చక్కగా ఉండే పొట్టేలు సంతానోత్పత్తికి ఉపయోగంగా ఉంటుందన్నారు. పొట్టేలు జత కలిపిన తరువాత తిరిగి పాకలోకి పంపాలి. జత కలిసే పొట్టేలుకు అదనంగా దాణా ఇవ్వాలని విత్తన పొట్టేలను విడిగా ఉంచాలని చెప్పారు.మందలో ఒకటి లేదా రెండు విత్తన పొట్టేళ్లను వదిలితే అవి ఎదకు వచ్చిన గొర్రెలను సులభంగా గుర్తించే అవకాశం ఉంటుందన్నారు. మేలైన విత్తన పొట్టేలును మందలో ఉంటే మేలు జాతి పిల్లలు పుడతాయన్నారు. జీవాల పెంపకంపై ఆసక్తి కలిగిన యువత సంప్రదిస్తే మరిన్ని సలహాలు సూచనలు అందజస్తామన్నారు.

విత్తన పొట్టేళ్లే ప్రధానం

గొర్రెల పెంపకం లాభదాయకం గా ఉంటుందని, అయితే, పెంపకంలో మేలైన జాతులకు చెందిన విత్తన పొట్టేళ్లను సమకూర్చుకొని బలమైన ఆహారం అందిస్తే రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా ఆర్థిక భరోసా లభిస్తుందని రొంపిచర్ల మండలం పశు వైద్యాధికారి డాక్టర్ వంశీ ప్రసాద్ అన్నారు. జీవాల పెంపకం దారులు మందలో పుట్టిన మగ పొట్టేలును విత్తన పొట్టేలుగా వాడుకోవచ్చని, ఒకలి లేదా రెండు విత్తన పొట్టేలు మార్చడం వలన జన్యుపరమైన సమస్య ఏర్పడకుండా ఉండడంతో పాటు మందలో గొర్రెలు ఈసుకుపోయే ప్రమాదం తగ్గుతుందన్నారు. విత్తన పొట్టేలును మార్చకపోతే జన్యుపరంగా పిల్లల్లో పెరుగుదల మందగించడం,అవిటి పిల్లలు జన్మించడం వంటి లక్షణాలు కని పిస్తాయని చెప్పారు.

పథకాలను సద్వినియోగం చేసుకోండి

జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి కాంతారావు

జీవాల పెంపకం దారులు ప్రభుత్వ పథకాలను, వైద్య సేవలను బీమా పథకాలను వినియోగించుకోవాలి. ప్రధానంగా సంప్రదాయ పద్ధతిలో సాగిన గొర్రెల పెంపకం నేడు వాణిజ్య పద్ధతిలో పెంచేందుకు యువత ముందుకు రావాలి. జీవాల పెంపకానికి పల్నాడు జిల్లా ఎంతో అనువైందని జిల్లాలో 5 లక్షలకు పైగా గొర్రెలు, 1.70 లక్షల వరకు మేకలు ఉన్నాయి.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-విజయపురిసౌత్

మాచర్ల మండలం విజయపురిసౌత్ లోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన సాగరమాత దేవాలయం లో క్రిస్మస్ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు.ఆలయ విచారణ గురువులు పామిశెట్టి జోసెఫ్ బాలసాగర్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. అనంతరం దివ్యబలి పూజ నిర్వహించారు. దేవాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పశువులపాక ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఈ సందర్భంగా విచారణ గురువులు జోసెఫ్ బాలసాగర్ మాట్లాడారు. కార్యక్రమంలో ఫాస్టర్ జోసెఫ్ తంబి, భక్తులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-మాచర్ల

మాచర్ల టౌన్, పరిసర గ్రామాలలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ప్రధాన చర్చిలల ప్రార్ధనలు నిర్వహించారు. ప్రభుత్వ విప్, ఎం.ఎల్.ఎ పిన్నెల్లి రామక్రిష్ణారెడ్డి, తెలుగుదేశం ఇన్‌చార్జీ జూలకంటి బ్రహ్మారెడ్డిలు క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని వారికి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజాశక్తి - రెంటచింతల

మండల కేంద్రమైన రెంటచింతల లోని ఆర్ సి ఎం, లూథరన్ చర్చిలో వేడుకలు జరిగాయి. ఫాదర్ ఇన్నారెడ్డి, ఫాదర్ ఏసుదానం మాట్లాడారు. అనం తరం క్రిస్మస్ కేకును కట్ చేశారు.

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి మండలలోని చర్చిలలో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. సత్తెనపల్లి పట్టణం లోని లూథరన్ చర్చి, ఆర్సీ ఎమ్ చర్చి, సెంటినరీ బాప్టిస్టు చర్చిలలో. విశేష ప్రార్ధనలు నిర్వహించారు.

విజయపురిసౌత్‌లోని సాగరమాత ఆలయంలో..

సత్తెనపల్లి నియోజకవర్గ టిడిపి ఇన్ ఛార్జి కన్నా లక్ష్మీనారాయణ పలు చర్చిలను సందర్శించి ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు

ప్రజాశక్తి - వినుకొండ

నియోజవర్గంలోని అన్ని గ్రామాల్లో క్రిస్మస్ జరుపుకున్నారు.పట్టణంలోని ఇమ్మానుయేలు తెలుగు బాప్టిస్ట్ చర్చ్, హొసన్న మందిరం, జిప్సీ చర్చ్, పరిశుద్ధ మార్క లూథరన్ దేవాలయం, పాలేమ్ పెంత్‌కోస్తు ప్రార్ధన మందిరం, యెరూషలేము చర్చ్, పరిశుద్ధ యోహాన్ లూథరన్ దేవాలయాల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మానాయుడు, పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావులు వేడుకలకు ముఖ్య అతిధులుగా హాజరై ప్రత్యేక ప్రార్ధనల్లో పాల్గొన్నారు.

గ్రామాలు, పట్టణాల్లో ఘనంగా క్రిస్మస్

తెనాలి టౌన్ చర్చిలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి - తెనాలి

క్రిస్మస్ వేడుకలను సోమవారం పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని బోస్ రోడ్డులోని క్రీస్తు దేవాలయంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పిల్లలు, పెద్దలు నూతన వస్త్రాలు ధరించి పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుంటూ పండ్లు, ఫలహారాలతో చర్చీలకు వచ్చారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ప్రజలందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని నందివెలుగు జాషువా నగర్ ఇమ్మానుయేలు ప్రార్థనా మందిరంలో వేడుకలకు ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బిషప్ రెవరెండ్ భాను ప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రేమ సేవ భావంతో క్రిస్మస్ వేడుకలు నిర్వహించుకోవడం అభినందనీయం అన్నారు. ఈ సందర్భంగా మందిరం తరఫున ఏర్పాటుచేసిన వస్త్రాలను పేదలకు బహూకరించారు. సర్పంచ్ డి.పవన్ కుమార్, సిపిఎం నాయకులు ఎం.శివసాంబిరెడ్డి, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

క్రిస్మస్ సందర్భంగా వడ్డేశ్వరంలో జరిగిన వేడుకల్లో టిడిపి సీనియర్ నాయకులు కాట్రగడ్డ మధుసూదన్‌రావు దంపతులు పాల్గొన్నారు. ఎస్సీలు ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి గ్రామ అధ్యక్షులు ఈపూరి బాబు, నాయకులు వి.అబ్రహం, వి.పండు, చిన్న, కె.సురేష్ పాల్గొన్నారు.

కుంచనపల్లిలో ఉదయం 5 నుండి రాత్రి 12 గంటల వరకు వివిధ మతాలకు చెందిన వారు వేడుకల్లో పాల్గొన్నారు. ఆంధ్ర ఇవాంజెలికల్ లూథరన్ చర్చ్‌లో ఆహ్లాదకరమైన వాతావరణంలో గీతాలు ఆలాపించారు. చర్చి పాస్టర్ రెవరెండ్ డి.రూబెన్ క్రిస్మస్ సందేశం అందించారు. సంఘ పెద్దలు ఎన్.డేవిడ్, బి.లోకయ్య, బి.మోషే, ఎన్.రాంబాబు, ఎం.అబ్రహం, కె.మహేశ్వరరావు, ఎన్.దావీదు, బి.సుదర్శన్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పట్టణంలో పలు ప్రాంతాల్లో వేడుకలు నిర్వహించారు. చర్చీల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ప్రజాశక్తి - పెదకాకాని రూరల్

సరస్వతీ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కె.సరస్వతి ఆధ్వర్యంలో స్థానిక దర్గా ఏరియాలోని వృద్ధులకు క్రిస్మస్ సందర్భంగా దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆరిఫ్, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

వడ్డేశ్వరంలో వేడుకల్లో పాల్గొన్న కాట్రగడ్డ మధుసూదన్‌రావు దంపతులు

విద్యుత్ కాంతులతో కుంచనపల్లి చర్చి

పెదకాకానిలో దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి దుగ్గిరాల

మండలం వ్యాప్తంగా వేడుకలను ఘనంగా నిర్వహించారు. పిల్లలు కొత్త వస్త్రాధారణలో ఉత్సాహంగా కనిపించారు. చర్చీలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

టిడిపిలో చేరిన 48 గంటల్లోనే వైసిపిలోకి

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరిలోని చేనేత వస్త్ర ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షులు పెండెం శివరామకృష్ణ (సిటీ కేబుల్ శివరామకృష్ణ) వైసిపిలో చేరారు. ఆ పార్టీ మంగళగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గంజి చిరంజీవి సమక్షంలో సోమవారం వైసిపి కండువా కప్పుకున్నారు. రెండ్రోజుల క్రితం ఉండవల్లిలోని టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేశ్ నివాసంలో ఆయన్ను కలిసి టిడిపిలో చేరిన శివరామకృష్ణ 48 గంటలు గడవక ముందే వైసీపీలో చేరారు. కులభిమానం కోసమే తాను మనసు మార్చుకుని వైసిపిలో చేరానని, పద్మశాలి సామాజిక తరగతి వారంతా చిరంజీవి వెంట నడవాలని ఈ సందర్భంగా శివరామకృష్ణ కోరారు. టిడిపిలో ఇటీవల చేరిన మరికొందరు వైసిపిలో చేరడానికి సిద్ధమవుతున్నట్లు తెలిసింది.

300లకు పైగా ప్రదర్శనలిచ్చిన చిన్నారి

ప్రజాశక్తి-తాడేపల్లి : ఉండవల్లి సెంటర్ వంశీ హైస్కూల్లో ఆరో తరగతి చదువుతున్న ఉండవల్లికి చెందిన సందు జిత్య దశావతారం, తరంగాలు, దరువులు, శబ్దాలు, జతీశ్వరం, అన్నమాచార్య కీర్తనలు వంటి నృత్యరూపకాలు సుమారు 300లకు పైగా ప్రదర్శనలిచ్చి ఔరా అనిపిస్తున్నారు. ప్రముఖ నాట్యాచారిణి మలిశెట్టి అనూషనాయుడు దగ్గర కూచిపూడి నేర్చుకున్న జిత్య ఇప్పటిదాకా ఎన్నో బహుమతులు గెలుచుకున్నారు. తమిళనాడులోని వేలూరు జాతీయ స్థాయి పోటీల్లో నంది అవార్డు, బాలరత్న, నాట్యమయూరి, హానర్ బుక్ ఆఫ్ ది రికార్డ్ వంటి పలు బహుమతులను కైవసం చేసుకున్నారు. రాష్ట్రంలోని ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రాల్లో నృత్య ప్రదర్శనలివ్వడంతోపాటు హైదరాబాద్‌లో భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో కూచిపూడి కళా వైభవం నృత్య ప్రదర్శనలో పాల్గొని గిన్నిస్ రికార్డు సొంతం చేసుకున్నారు. నాట్యాచారిణిగా ఎదగాలని, కళను అందరికీ అందించాలని ఈ చిన్నారి చెబుతున్నారు.

'కూచిపూడి'లో రాణిస్తున్న చిన్నారులు

ప్రజాశక్తి-తాడేపల్లి : చదువుతో పాటు కూచిపూడి నృత్యం, వివిధ రకాల కళల్లో చిన్నారులు రాణిస్తున్నారు. తల్లిదండ్రులు, పెద్దల ప్రోత్సాహమే తాము కళల్లో రాణించడానికి కారణమని చెబుతున్నారు. తాడేపల్లికి చెందిన పలగాని ఖ్యాతిశ్రీ, పలగాని రేణుకశ్రీ, రాయన కీర్తన, ఆద్య దీపిక, ఎం.కారుణ్య ప్రజ్వల ఇటీవల హైదరాబాద్‌లో గచ్చిబౌలి స్టేడియంలో కూచిపూడి కళా వైభవం నాట్య ప్రదర్శన చేశారు. భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రదర్శనకు గిన్నిస్ రికార్డు లభించింది. కార్యక్రమాన్ని నిర్వహించిన భారత్ అకాడమీ గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌ను సొంతం చేసుకుంది. చిన్నారులను పలువురు అభినందిస్తున్నారు.

అవార్డుతో రేణుకశ్రీ

'ఉమ్మడి అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పనిచేయాలి'

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

రాబోయే ఎన్నికల్లో మంగళగిరి నియోజకవర్గం ఉమ్మడి అభ్యర్థి గెలుపే లక్ష్యంగా, ప్రతి ఒక్క కార్యకర్తా పనిచేయాలని, టిడిపి, జనసేన తాడేపల్లి మండల అధ్యక్షులు అమర సుబ్బారావు, సామల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. సోమవారం రాత్రి కోలనుకొండలో టిడిపి, జనసేన ముఖ్య కార్యకర్తల సమావేశం టిడిపి, జనసేన కొలనుకొండ గ్రామ అధ్యక్షులు కంచర్ల రంగారావు, శ్రీకాంత్ అధ్యక్షతన జరిగింది. టిడిపి, జనసేన పార్టీల నాయకులు మాట్లాడుతూ రాబోయే అసెంబ్లీ ఎన్నికలలో టిడిపి, జనసేన పార్టీల ఆధ్వర్యంలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడుతుందని అన్నారు. గ్రామస్థాయి నుండి ఇరు పార్టీల కార్యకర్తలు నాయకులు సమిష్టి కృషిచేసి ఉమ్మడి అభ్యర్థిని గెలిపించాలని కోరారు. పొత్తులు సీట్ల గురించి, అధినాయకులు నిర్ణయం తీసుకుంటారని, కార్యకర్తలు అపోహలకు, గురికా వద్దని అన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కొల్లి శేషు, జనసేన గుంటూరు జిల్లా నాయకులు బడే కోమలి, తెలుగు మహిళ మండల అధ్యక్షులు బి.కృష్ణవందన, మాజీ ఎంపిటిసి గనికే అనిత, తెలుగు రైతు మండల కార్యనిర్వహణ కార్యదర్శి నూతక్కి నాగేశ్వరరావు, జనసేన తాడేపల్లి మండల కార్యదర్శి లాల్‌చంద్, ఎన్.నాగరాజు, జి.తంబి, ఎన్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న ఇరు పార్టీల నాయకులు

'చేనేతలకు 6 అసెంబ్లీ స్థానాలు, 3 ఎంపీ స్థానాలు కేటాయించాలి'

ప్రజాశక్తి - మంగళగిరి

ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ జాతీయ కమిటీ సమావేశం ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కార్యాలయంలో సోమవారం జరిగింది. ఏఐడబ్ల్యూఎఫ్ జాతీయ అధ్యక్షులు బండారు ఆనంద ప్రసాద్, జాతీయ గౌరవాధ్యక్షులు నక్కిన చిన్న వెంకటరాయుడు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో చేనేత వర్గాల జనాభా అధికంగా కలిగిన చీరాల, మంగళగిరి, వెంకటగిరి, రాజమండ్రి రూరల్, ధర్మవరం, ఎమ్మిగనూరు, పొద్దుటూరు, జమ్మలమడుగు, మదనపల్లి, ఎచ్చెర్ల, గాజువాక ప్రాంతాల్లో కనీసం ఆరు అసెంబ్లీ సీట్లను ప్రతి రాజకీయ పార్టీ కేటాయించాలని, రాజమండ్రి, కర్నూలు, హిందూపురం పార్లమెంటు నియోజకవర్గాల్లో ప్రతి రాజకీయ పార్టీ చేనేత వర్గాల వారికి కేటాయించాలని కోరారు. మొత్తంగా కనీసం ఆరు అసెంబ్లీ స్థానాలు, రెండు పార్లమెంటు స్థానాలు చేనేతలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. చేనేత మంత్రిత్వ శాఖను చేనేత వర్గాల వారికే కేటాయించి, ఆ వర్గాల వారికే చేనేత మంత్రుల శాఖను ఇవ్వాలని, రాష్ట్రంలో చేనేతకళను పరిరక్షించడానికి తగిన చర్యలు చేపట్టాలని కోరారు. చేనేత కళ పరిరక్షింపబడాలన్నా, చేనేత కార్మికుల జీవితాలు బాగుపడాలన్నా, చేనేతల సంక్షేమం కోసం చేనేత మంత్రిత్వ శాఖను చేనేత వృత్తిపై అవగాహన ఉన్న చేనేత సామాజిక వర్గాల వారికే కేటాయించాలన్నారు. చేనేతను జౌళిశాఖనుండి విడదీసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి ఏటా చేనేతలకు ప్రత్యేక బడ్జెట్ ప్రకటించాలని కోరారు. సమావేశంలో ఏఐడబ్ల్యూఎఫ్ ఉపాధ్యక్షులు గడిగ రామదాసు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ సమతం రమణ మహేష్, కోశాధికారి గుంటుకు చంద్రశేఖర్, జాతీయ అధికార ప్రతినిధి రాపోలు జగన్, ఏఐడబ్ల్యూఎఫ్ ఏపీ రాష్ట్ర అధ్యక్షులు యినమాల శివరాం ప్రసాద్, జాతీయ కమిటీ సభ్యులు డాక్టర్ పిజికె వెంకటేశ్వరరావు, చింతా శ్రీనివాసులు, పప్పు దుర్గా రమేష్, కటారె కిరణ్ కుమార్, రామనాథం పరమేశ్వరరావు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న నాయకులు

బెంబేలెత్తిస్తున్న కుక్కలు

ప్రజాశక్తి - పెదకాకాని రూరల్

మండల కేంద్రమైన పెదకాకాని శివారు ప్రాంతాల్లో కుక్కలు హడల్ పుట్టిస్తున్నాయి. వెనిగండ్ల నుండి పెదకాకాని వెళ్లే దారిలోని కోరి వద్ద, వెనిగండ్ల హైస్కూల్ మార్గంలో రేయింబవళ్లు స్వైర విహారం చేస్తున్నాయి. పాదచారులను కరవడంతోపాటు ద్విచక్ర వాహనాలపై వెళ్లేవారివెంట పడుతూ భయభ్రాంతులను గురి చేస్తున్నాయి. కుక్కల నుండి తప్పించుకునే ప్రయత్నంలో పలువురు వాహన చోదకులు ప్రమాదం గురవుతున్నారు. వ్యాపారం, ఇతర పనులు ముగించుకుని రాత్రివేళల్లో ఇళ్లకు వేళ్లే వారిపై ఒక్కసారిగా 5 నుంచి 10 కుక్కలు దాడికి వస్తున్నాయి. గతంలో విద్యార్థులు కుక్కల దాడికి గురయ్యారు. దీనిపై అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

యువగళం విజయవంతంపై మాజీ మంత్రి హర్షం

ప్రజాశక్తి - తెనాలి

వైసిపి పాలనా వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్ళేందుకు టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర విజయవంతంపై మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. స్థానిక కొత్తపేటలోని టిడిపి కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని వైసిపి పాలనకు చరమగీతం పాడేందుకు, వైసిపి విముక్త ఆంధ్రప్రదేశ్ ఏర్పాటుకు రానున్న ఎన్నికల్లో టిడిపి, జనసేన పొత్తులతో ముందుకు సాగుతుందన్నారు. వైసిపిలో కొత్తగా నియోజకవర్గాల్లో సిట్టింగ్ అభ్యర్థుల మార్పుతోనే ఆ పార్టీ ఓటమికి ఖరారైందని చెప్పారు. ఇదిలా ఉంటే ఖరీఫ్‌లో తుపాను ప్రభావంతో పంట నష్టపోయిన రైతుల్ని ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైం దన్నారు. సిఎం జగన్ పరదాల చాటున వచ్చి రైతుల్ని పలకరించకుండానే వెళ్లి పోయారని ఎద్దేవా చేశారు. మద్య నిషేధమని చెప్పి మహిళలను మోసం చేశారన్నారు. ప్రజలకు ప్రయోజనం లేకున్నా రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో నెట్టారన్నారు. నాడు-నేడు ద్వారా విద్యారంగంలో మార్పులంటూ ప్రచారం చేసి, ఆరు లక్షల మందిని విద్యకు దూరం చేశారని, అంగన్వాడి కేంద్రాలను పట్టించుకున్న పాపాన పోలేదని, సమ్మెకు దిగినా వారితో చర్చలు జరిపే తీరికలేకుండా ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. ఈ నిరంకుశ ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం చెప్పే రోజు త్వరలోనే ఉందన్నారు.

మాచర్లను కప్పేసిన పొగ మంచు

ప్రజాశక్తి - మాచర్ల

మాచర్ల పరిసర ప్రాంతాలను సోమవారం విపరీతంగా పొగ మంచు కప్పేసింది. ఎప్పుడూ లేనంతగా తెల్లవారుజాము నుండి ఉదయం 10 గంటల వరకు పొగమంచు దట్టంగా అలుముకోవడంతో వాహనదార్లు ఇబ్బంది పడ్డారు. లైట్లు వేసుకుని చాలా నిదానంగా ప్రయాణించాల్సి వచ్చింది.

సుందరయ్య నగర్, లాడ్జి సెంటర్‌లో మనుస్మృతి ప్రతులను దహనం చేస్తున్న వివిధ సంఘాల నాయకులు, కార్యకర్తలు

కుల వ్యవస్థను ప్రోత్సహించే మనుస్మృతి దహనం

ప్రజాశక్తి-గుంటూరు

నిచ్చెన మెట్ల కుల వ్యవస్థను ప్రోత్సహిస్తూ నిమ్న జాతులపై విషాన్ని చిమ్మిన మనుస్మృతిని అంబేద్కర్ దహనం చేసి 96 ఏళ్లయిన సందర్భంగా సోమవారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య నగర్‌లో మనుధర్మ శాస్త్ర ప్రతులను కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్), సిఐటియు ఆధ్వర్యంలో దహనం చేశారు. కెవిపిఎస్ నాయకులు జి.లూథర్‌పాల్ మాట్లాడుతూ అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని పక్కనపెట్టిన వర్ణ వ్యవస్థను పెంచి పోషించిన మనుస్మృతిని అమలు చేయాలని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం యత్నిస్తోందని విమర్శించారు. లౌకిక, ప్రజాతంత్ర వాదులంతా ప్రయత్నాన్ని అడ్డుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు షేక్.ఖాసిం షహీద్, సిఐటియు నాయకులు మస్తాన్‌వలి, జి.శంకరరావు, పి.అశోక్, షేక్ అబ్దుల్లా, అఫ్రోజ్, ఐద్వా నాయకులు షేక్.ఖాజాబి, నాగమ్మ పాల్గొన్నారు.

కెఎన్‌పిఎస్, పలు దళిత సంఘాల ఆధ్వర్యంలో సోమవారం స్థానిక లాడ్జి సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం ఎదుట మనుస్మృతిని దహనం చేశారు. కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి కె.కృష్ణ మాట్లాడుతూ నిమ్నజాతాలు వేదాలు చదవరాదని, వినరాదని, చదివితే నాలుక తెగ్గొయ్యాలని, వింటే చెవుల్లో సీసం పొయ్యాలని శాసించిన మనుస్మృతిని 1927 డిసెంబర్ 25న మహద్‌లో వేలాది మంది కార్యకర్తల మధ్య డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ దహనం చేశారని గుర్తు చేశారు. కంప్యూటర్ యుగంలోనూ కుల అసమానతలు పెంచి పోషించాలని బిజెపి యత్నిస్తోందని, రాజ్యాంగానికి తూట్లు పొడిచి, ఆ స్థానంలో మనుస్మృతిని అమలు చేయాలని చూస్తోందని విమర్శించారు. ఆధునిక మనువాద పాలకుల్ని ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు కె.నాగేశ్వరరావు, సిహెచ్.రాజశేఖర్, ఎన్.పోతురాజు, ఎన్.నీలాంబరం, ఎన్.బ్రహ్మయ్య, జి.ప్రభుదాసు పాల్గొన్నారు.

కెటిల్ బెల్ స్పోర్ట్స్‌లో ఏపీ క్రీడాకారుల ప్రతిభ

ప్రజాశక్తి-గుంటూరు

ముంబాయిలో ఈనెల 15, 16, 17 తేదీల్లో వరల్డ్ కెటిల్‌బెల్ స్పోర్ట్ ఫెడరేషన్ నిర్వహించిన ఆసియా/ఓషియానియా ఛాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ముగ్గురు క్రీడాకారులు 5 ఈవెంట్లలో పాల్గొని 2 బంగారు పతకాలు, 2 రజత పతకాలు, 1 కాంస్య పతకం సాధించారని ఎపి గిరేవోయ్ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ పి.వి.రాఘవశర్మ సోమవారం తెలిపారు. ఎమ్‌డి.అనాస్ వన్ ఆర్మ్‌లాంగ్ సైకిల్ కెటిల్‌బెల్ 30 నిముషాల హాఫ్ మారథాన్ అండర్ (18 కేటగిరీ)లో గోల్డ్ మెడల్ సాధించగా, ఎమ్‌డి.జావీద్ 24 కిలోల కెటిల్ బెల్ 10 నిముషాల క్లాసిక్‌లో గోల్డ్ మెడల్, 30 నిముషాల హాఫ్ మారథాన్‌లో కాంస్యం సాధించారు. డాక్టర్ సిహెచ్.నీలిమ రెండు రజత పతకాలు సాధించారు. వీరిని డాక్టర్ రాఘవ శర్మ అభినందించారు.

పతకాలు సాధించిన క్రీడాకారులతో డాక్టర్ రాఘుశర్మ

ఖాళీ విస్తర్లతో సమగ్ర శిక్షా ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

సమగ్ర శిక్షా అభియాన్ (ఎస్ఎస్ఎ) ఉద్యోగులు విధి నిర్వహణలో అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని, అయితే వారు వాటిని పక్కనపెట్టి కేవలం ప్రతిపక్ష నేత హోదాలో జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీల అమలునే కోరుతున్నారని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ముజఫర్ అహ్మద్ అన్నారు. అయినా ప్రభుత్వం నుండి సరైన స్పందన లేదని, ఇప్పటికైనా తన మొండివైఖరిని విడనాడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమగ్ర శిక్షా అభియాన్‌లో పనిచేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులను విద్యా శాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని, వేతనాలు పెంచాలని, గ్రాట్యుటీ ఇవ్వాలని ఏపి సమగ్ర శిక్షా కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (జెఎసి) ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మె క్రిస్మస్ రోజైన సోమవారమూ కొనసాగింది. ఉద్యోగులు ఖాళీ విస్తరాకులతో వినూత్న నిరసన తెలిపారు. సమ్మె శిబిరాన్ని సందర్శించిన ముజఫర్ అహమ్మద్ మాట్లా డుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులు తాము ఒంటరిగా అనుకోవద్దని, పోరాటానికి సిఐటియు అండగా ఉంటుందని చెప్పారు. ప్రభుత్వం స్పందించే వరకూ పోరాటాన్ని ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా ఉన్న 500 రైతు సంఘాలతో ఢిల్లీలో చేపట్టిన మహాధర్నా మాదిరి ఈ నెల 29న సిఐటియుతో పాటు అన్ని కార్మిక సంఘాలు ఒక వేదికగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నాయని, అందులో సమగ్ర శిక్షా ఉద్యోగులు కూడా భాగస్వామ్యం కావాలని కోరారు. ఐక్యంగా పోరాటాలు చేస్తే ముఖ్య మంత్రి మెడలు వంచడం పెద్ద కష్టమేమీ కాదన్నారు. ప్రాథమిక విద్యను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నాయని, ఈ విద్య అభివృద్ధి కోసం అంగన్వాడిలు, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, సమగ్ర శిక్ష ఉద్యోగులు ఎంతగానో కష్టపడి పని చేస్తున్నారని చెప్పారు. అభివృద్ధి చెందిన అమెరికా వంటి దేశాలే విద్యా రంగం బలోపేతానికి జిడిపిలో 10 శాతం కేటాయిస్తే మనదేశంలో మాత్రం 6 శాతమే కేటాయిస్తున్నారని విమర్శించారు. ఈ మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వం రెట్టింపు చేయాలని,రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రాథమిక విద్యకు బడ్జెట్లో నిధులు పెంచాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నరసరావుపేట మండల అధ్యక్షులు షేక్ సిలార్ మసూద్, రైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు కె.రామారావు తదితరులు పాల్గొన్నారు. సమ్మె శిబిరాన్ని యుటిఎఫ్ నకరికల్లు మండల ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు, ఎస్‌టియు రొంపిచర్ల మండల అధ్యక్షులు కె.వీరబ్రహ్మాచారి సందర్శించి సంఘీభావం తెలిపారు. ఉద్యోగుల పట్ల ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోందని, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ పేరుతో వెట్టిచాకిరి చేయిస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో ఉద్యోగులు డి.నరసింహస్వామి, పి.నరసింహ నాయక్, బి.కోటేశ్వరరావు నాయక్, ఎం.శివ నాగ ప్రసాద్, ఎం.పోతురాజు, పి.రామకృష్ణ, పి.సాంబశివరావు, డి.శ్రీకాంత్, షేక్ బాషా, ఎన్.మంగయ్య, కె.వెంకట్, డి.లింగయ్య పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న ఉద్యోగులు, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ముజఫర్ అహమ్మద్

చట్టాల పటిష్ట అమలుతోనే దాడులకు అడ్డుకట్ట : ఐద్వా

ఫిబ్రవరి 9, 10, 11 తేదీల్లో విశాఖపట్నంలో జాతీయ సమావేశాలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

చట్టాలను పటిష్టంగా అమలు చేయడం ద్వారానే మహిళలపై దాడులకు, అత్యాచారాలకు, హింసకు అడ్డుకట్ట వేయడం సాధ్యమవుతుందని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర కమిటీ సభ్యులు గద్దె ఉమశ్రీ అన్నారు. ఐద్వా పల్నాడు జిల్లా కార్యదర్శి జి.రజినితో కలిసి నరసరావుపేటలోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో సోమవారం విలేకర్లతో మాట్లాడారు. మహిళలపై దాడులకు అడ్డుకట్ట వేసేందుకు సమగ్రమైన చట్టాలను సక్రమంగా అమలు చేయాలని ప్రభుత్వానికి ఐద్వా నివేదించిన ప్రభుత్వ స్పందించడం లేదన్నారు. మహిళలు, బాలికలపై నిత్యం దాడులు, అత్యాచారాలు జరుగుతూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రచారార్భాటంగా చేస్తున్న దిశా చట్టం నిరుపయోగంగా ఉందని విమర్శించారు. దాడులకు అత్యాచారాలకు పాల్పడిన వారిపై తక్షణ విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలన్నారు. దిశా చట్టం ద్వారా 21 రోజుల్లో దోషులకు శిక్ష వేస్తామని చెప్పారని అత్యాచారం, హత్య కేసుల్లో నేర నిర్ధారణ కాకుండా చర్యలు తీసుకోవడం కుదరదని, ఫోరెన్సిక్ వివరాలు రావాలంటే 6 నెలలు పడుతుందని పోలీసులు చెబుతున్నారని, ఈలోగా చట్టాలను ఉపయోగించుకుని నిందితులు సాక్ష్యాలను రూపుమాపుతున్నారని అన్నారు. శిక్షలు పడకపోవడంతో నిందితులింకా రెచ్చిపోతున్నారని, వీటన్నిటిపై ప్రభుత్వం స్పందించి చట్టాలను పటిష్టం చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. స్వాతి మాస పత్రికలో వస్తున్న బూతు, పడక గదిలోని అంశాల ప్రచురణ ఆపాలని ఐద్వా ఆధ్వర్యంలో కేసు వేశామని తెలిపారు.

76 ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో ఆజాదీక అమృతమహోత్సవాలు జరుపుకుంటున్న నేపథ్యంలో సగభాగంగా ఉన్న స్త్రీలకు ఒరిగిందేమీ లేదన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో, రాష్ట్రంలో, నిరుద్యోగం, పేదరికం, కరువు పెరిగాయన్నారు. మహిళ రిజర్వేషన్ బిల్లు-2024ను అమలు చేయకపోవడం మహిళల పట్ల కపట ప్రేమకు నిదర్శనమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన దిశా బిల్లును చట్టంగా కాకుండా కేంద్ర ప్రభుత్వ తొక్కి పట్టిందని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ మహిళలపై దాడులు పెరిగాయని, ఈ నేపథ్యంలో మహిళలపై దాడులు, అత్యాచారాలు, హింసలను అరికట్టేందుకు ఐద్వా నిర్విరామంగా పోరాడుతోందని, ఈ క్రమంలో వచ్చే ఏడాది ఫిబ్రవరి 9, 10, 11 తేదీల్లో విశాఖపట్నంలో జాతీయ సమావేశాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. సమావేశంలో ఐద్వా పట్టణ అధ్యక్షులు నాగమ్మ భాయ్, కార్యదర్శి ఫాతిమా, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థినికి పాముకాటుపై విచారణకు ఆదేశం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

మండల కేంద్రమైన నకరికల్లులోని కాస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో చదువుతున్న సయ్యద్ సమీరా పాము కాటుకు గురైన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై స్పందించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బలహీన వర్గాల కమిషన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు బత్తుల పద్మావతి సత్వర విచారణకు పల్నాడు జిల్లా విద్యాశాఖాధికారి కె.శామ్యూల్‌ను ఆదేశించారు. నకరికల్లుకు చెందిన సయ్యద్ సమీరా కస్తూర్బా గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నారు. ఈనెల 19వ తేదీ సాయంత్రం సమయంలో దుస్తులు ఆరబెట్టుకునేందుకు స్కూలు వెనక ఖాళీ ప్రదేశంలోకి వెళ్లగా పాము కాటేసింది. ఉపాధ్యాయిని ద్వారా ఈ సమాచారాన్ని తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు బాలికను గ్రామంలోని ఆర్ఎంపి వైద్యుని వద్దకు తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స అనంతరం సమీర రెండ్రోజుల పాటు మందులు వాడుకున్నారు. అయితే శనివారం మధ్యాహ్నం అకస్మాత్తుగా నీరసంతో కళ్లు తిరిగి పడిపోవడంతో తల్లిదండ్రులు మళ్లీ నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు తీసుకు వెళ్లారు. ప్రస్తుతం బాలిక ఆరోగ్యం నిలకడగా ఉందని, ప్రమాదమేమీ లేదని సమాచారం. సమీరా తండ్రి లారీ డ్రైవర్ కాగా తల్లి వీధి విక్రేతగా జీవనం సాగిస్తున్నారు. పాఠశాలలో దుస్తులు ఆరేసుకునే ఖాళీ స్థలంలో లైట్లు లేకపోవడంతో ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని విద్యార్థినులు చెబుతున్నారు.